

# వార్త

ఆదివారం

8 డిసెంబరు, 2024









# పెళ్లి ఖర్చుల పాట్లు..

## లక్షలు దాటి కోట్లు!

# నాని చిత్రంలో రమ్యకృష్ణ?

నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సాలిడ్ హిట్ చిత్రం 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం తర్వాత తన 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న భారీ ప్రాజెక్ట్ 'ప్యారడైజ్'. దీనిపై అనౌన్స్‌మెంట్‌తో మంచి హైప్ సెట్టవ్వగా ఇపుడు శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది.
అయితే ఈ చిత్రంలో రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. నానికి తల్లి పాత్రలో నటించనున్నట్లు వినికిడి. ఈ సినిమాలో రమ్యకృష్ణ పాత్ర ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి మరి. దీంతో పాటు నాని క్రైమ్ థ్రిల్లర్ 'హిట్3'లో కూడా నటిస్తున్న సంగతి విదితమే. ఈ సినిమా తాను పరిచయం చేసిన యువ దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్నాడు.



## తారాతీరం



# సూర్య కొత్త సినిమా

'కంగువ' సినిమాతో దెబ్బతిన్న సూర్య తరువాతి ప్రాజెక్ట్ మొదలు పెట్టారు. సూర్య కొత్త సినిమా మెగా ఎంటర్‌టైనర్ సూర్య 45 పూజా కార్యక్రమంతో ఆనైమలైలోని అరుల్మిగు మాసాని అమ్మన్ ఆలయంలో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పై ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ హౌస్ మోస్ట్ ఎక్స్‌పెన్సీవ్ చిత్రం. మల్టీ టాలెంటెడ్ ఆర్జే బాలాజీ మెగా ఎంటర్‌టైనర్‌కి దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా కోయంబత్తూర్‌లో మొదటి షెడ్యూల్ షూటింగ్ జరుగనుంది. సూర్య, ఇతర ప్రధాన నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం.
ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలోని మిగతా నటీనటులు, టెక్నీషియన్స్ వివరాలు తెలియనున్నాయి.

ఆదివారం వార్త

8 డిసెంబరు, 2024

## మంచి ముత్యాలు

హృదయశుద్ధిగలవారు ధన్యులు,
వారు దేవుని చూచెదరు.

- జీసస్ క్రైస్ట్

## విషయ విశేషం

ఉచితంగా కథల ప్రచురణ....4

సంఘీ'భావం....5

సమస్యల వలయంలో గురుకులాలు

కవర్ స్టోరీ

పెళ్లి ఖర్చుల పాట్లు..
లక్షలు దాటి కోట్లు!

ఈవారం కవిత్వం...12

ఇంకెన్నాళ్లీ మూసీ మురికి..

మహిళా బాడీ బిల్డర్ ఎస్తేరు....14

ప్రాణరక్షణకు హెల్మెట్.....18

కథ..20

అనగనగా ఓ తల్లి

సాహిత్యం...23

తెలుగు భాష ప్రాచీన వైభవం

ఇతరులకు సహాయం చేస్తే......25

అవసరానికి మించి.....26

దేవదేవుడు కొలువైన క్షేత్రం....28

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## అదుపులో బి.పి.



బీపీని అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా... అయితే, ఓ ఐదునిమిషాలు వెచ్చిస్తే చాలంటోంది యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ, లండన్ కాలేజీలు చేసిన పరిశోధన. ఈ పరిశోధకులు మన రోజువారి కార్యకలాపాలని నిద్ర, కూర్చునే ఉండటం, మెల్లగా నడవడం, వేగంగా నడవడం, నిల్చునే ఉండిపోవడం, వ్యాయామం ఇలా ఆరు రకాలుగా విభజించారు. ఒక రోజులో సగటున ఏడుగంటల్ని నిద్రకు వదిలేస్తే.. పది గంటలు కూర్చునే ఉంటామనీ. 10 నిమిషాలు మెల్లగా నడుస్తూ ఉంటామనీ, ఐదు నిమిషాలు వేగంగా నడుస్తామనీ, పది నిమిషాలు నిల్చుని ఉంటామనీ విశ్లేషించారు. వీటిల్లో కూర్చునే ఉన్నప్పుడు ఓ పదినిమిషాలు మెల్లగా నడవడం నుంచి ఓ ఐదు నిమిషాలు, నిల్చునే ఉండటం నుంచి ఓ ఐదు నిమిషాలు... తీసుకుని ఆ సమయంలో చిన్నపాటి వ్యాయామం చేస్తే రక్తపోటు గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. ఉదాహరణకి... మెల్లగా నడుస్తున్నారనుకోండి వేగం పెంచి కనీసం మరో ఐదు నిమిషాలైనా నడవాలట. కూర్చునో, నిల్చునో ఉండాల్సి వచ్చిందనుకోండి ఓ పదినిమిషాలు అలా మెట్లెక్కి దిగడమో. సైక్లింగో చేయాలట. అంతేకాదు. రోజులో ఐదు నిమిషాలు వేగంగా నడుస్తారనుకోండి... దాన్ని పదినిమిషాలు చేయాలట. రోజులో 20 నిమిషాలు వ్యాయామానికి కేటాయిస్తుంటే దాన్ని మరో ఐదు నిమిషాలకి పెంచాలట. ఇలా చేస్తే రక్తపోటు అదుపులోకి వస్తుందంటున్నారు పరిశోధకులు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# ఉచితంగా కథల ప్రచురణ

**ఈతరం పిల్లలు రీల్స్ చూసేందుకు ఎక్కువ సమయాన్ని వృథా చేస్తున్నారు, ఇక కథలు చదివే తీరికెక్కడిది? మొబైల్లో స్క్రోల్ చేసుకుంటూ వెళ్లిపోతారు కానీ, అంతంత కథలు ఎవరు చదువుతారు బ్రో..రంజీత్ ప్రతాప్సింగ్‌కు ఇలాంటి ప్రశ్నలు చాలానే ఎదురయ్యాయి.**

'కథ బాగుంటే ఎంత పెద్దదైనా చదువుతారు' అన్న ఒకే ఒక్క నమ్మకంతో ప్రతిలిపి ఆన్‌లైన్ కథల వేదికని మొదలుపెట్టాడు రంజీత్... అతని నమ్మకమే నిజమైంది. కోటి కథలతో... రూ.58కోట్ల రూపాయల ఆదాయంతో యువతరాన్ని ఆకట్టుకుంటోంది ఆన్‌లైన్ కథల వేదిక. పుస్తకాల పురుగు అంటారే... చిన్నప్పుడు అలానే ఉండేవాడు రంజీత్ కనిపించిన ప్రతి పుస్తకాన్నీ చదివేసేవాడు. తన సొంతూరు ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ. తండ్రి ఆర్మీ ఉద్యోగి, దాంతో ఒక్క ఊర్లో కుదురుగా ఉండటానికి లేదు, కానీ వెళ్లిన ప్రతిచోటా పుస్తకాలే నేస్తాలయ్యేవి. పుస్తకాల దుకాణాల్లో ఐదారుగంటలు పనిచేసి బదులుగా పుస్తకాలు తీసుకునేవాడు.

**పట్టుదలతో ముందుకు..**

ఈ పుస్తకాలు అన్నం పెట్టవు కానీ, వేరే దారి చూసుకో అని బంధువులూ, స్నేహితులూ గట్టిగా చెప్పడంతో అందరిలానే ఇంజినీరింగ్ బాటపట్టాడు. అది పూర్తయ్యాక కొన్నేళ్లు కార్పొరేట్ సంస్థల్లోనూ పనిచేశాడు. కొన్ని నగరాల్లో ఇంగ్లిష్ పుస్తకాలు దొరికినంత సులభంగా హిందీ పుస్తకాలు దొరికేవికాదు. ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా ఎవరికైనా, ఎక్కడైనా పుస్తకాలు అందుబాటులో ఉంటే బాగుండును కదా అనుకున్నాడు. అదే మాట స్నేహితులతో చెబితే... ఓ ప్రయత్నం చేద్దామంటూ శంకర్నారాయణన్, రాహుల్అంజన్, ప్రశాంతగుప్తా, సప్రహదాయీమోడీ అనే మిత్రులు ముందుకొచ్చారు. రంజీత్ ముందుగా కొందరు రచయితలని కలిశాడు... కథలు కావాలని, చదివేవాళ్లు లేనప్పుడు సమయం వృథా చేసుకుని ఎందుకు రాయాలి? అన్నారు. వాళ్లు. చదివేవాళ్లు లేరు... అనే మాటని పక్కనపెట్టి... ఆన్‌లైన్ వేదికగా ప్రతిలిపిలో ఎవరైనా ఉచితంగా తమ కథలని ప్రచురించుకునే





ఏర్పాటు చేశాడు రంజీత్. 2014లో ప్రారంభమైంది ఆన్‌లైన్ వేదిక ఇందులో ఎంత పెద్ద కథ అయినా రాసుకోవచ్చు. ఆదే ఈ ఆప్ ప్రత్యేకత. ఆ కథలకి హంగులు అద్ది పాఠకులకు చేరవేసే బాధ్యత ప్రతిలిపిది. ఈ వేదికలో మొదట్లో పాఠకులకంటే రచయితలే ఎక్కువగా ఉండేవారు! ప్రముఖ హిందీ రచయితల పుస్తకాలు కొన్ని ఈ వేదిక పైకి తీసుకు రాగానే నెమ్మదిగా ఆదరణ పెరిగింది. అలా ప్రారంభమైన ఈ ఆప్ తెలుగూ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ, ఉర్దూ, కన్నడ వంటి పన్నెండు భాషల్లోకి విస్తరించింది. ఆమెజాన్ ఆధ్వర్యంలో వెస్ట్‌ల్యాండ్ అనే పుస్తకాల సంస్థ ఉండేది. అది మూతబడిందని తెలిసి ఆ బృందంతో మాట్లాడి ఆ సంస్థని టేకోవర్ చేసుకున్నాడు రంజీత్. వాళ్ల అనుభవం ఈ వేదికకి చక్కగా ఉపయోగపడింది.




ప్రతిలిపి తెలుగులో సుమారు మూడున్నర వేలమంది యువ రచయిత లున్నారు. పాతతరంవారి రచనలతోపాటు అనేకమంది కొత్త రచయితల కథలూ అందుబాటులో ఉన్నాయి. ఈ వేదికకే ఆదరణ పెరగడంతో ప్రతిలిపి ఎఫ్ఎం, కామిక్స్, పాడ్కాస్టింగ్ వంటి కొత్త విభాగాలూ, ప్రారంభమయ్యాయి. ఈ వేదికలో మొత్తం 16 లక్షలమంది రచయితలు ఉంటే.. నెలకి రెండు కోట్లమంది పాఠకులు ఈ కథలను చదువు తున్నారు. ఇక్కడ రచయితలకి అభిమాన సంఘాలు కూడా ఉంటాయి. ఎక్కువ మంది అభిమానం సంపాదించుకున్నవారు ఆదాయాన్నీ సంపాదించుకుంటున్నారు. నెలకి రెండు లక్షల రూపాయల వరకూ అందుకుంటున్న రచయితలూ ఉన్నారు. అలాగే సేవాల్ సర్వీసుల్లో ఉన్న కథలని చదవడానికి పాఠకులు కొంత సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఆప్‌లో ప్రచురితమైన కథలని టీవీ సీరియళ్లుగా, వెబ్ సీరీస్‌గా తీయడానికి ఆసక్తి పెరుగుతోంది. దాంతో ఆమెజాన్. డిస్నీస్టార్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తోంది సంస్థ. ఆ మధ్యే సంస్థ విస్తరణ కోసం రూ.67 కోట్ల రూపాయల పెట్టుబడులూ అందుకుంది. త్వరలో ఐపీఓకి కూడా రాబోతోంది.



# సమస్యల వలయంలో గురుకులాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలతో పాటు సామాన్య, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందాలంటే గురుకులాల్లో చేరడానికి ఆసక్తి చూపిస్తారు. సాధారణ ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే గురుకులాల్లో విద్యాబోధన కొంత మెరుగ్గా ఉంటుంది. పైగా పాఠశాలల్లో వసతిసదుపాయం ఉండటంతో అక్కడే ఉండి చదువుకోవడం వల్ల ఆశించిన మేరకు ఫలితాలు లభిస్తాయి. కాస్తంత ప్రతిభ ఉన్నా గురుకులాల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనతో వారికి ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందని తల్లిదండ్రులు కూడా గురుకులాల వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే ఇక్కడి పరిస్థితులు మాత్రం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఆశించిన మేరకు మార్పులు రావడం లేదు. ముఖ్యమంత్రులు, మంత్రులు చేస్తున్న ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపితే గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలుస్తుంది. కొన్ని గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సకాలంలో అద్దెలు చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు మరమత్తులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. మరికొన్ని ప్రభుత్వ భవనాల్లో ఉన్నప్పటికీ అక్కడి పరిస్థితులు కూడా ఏమాత్రం విద్యార్థులకు అనుకూలంగా ఉండటం లేదు. కొన్ని గురుకులాల్లో సుమారు మూడు నుంచి నాలుగు వందల మంది ఉంటున్నారు. అక్కడ వీరికి సరిపడా స్నానాల గదులు, మరుగుదొడ్లు ఉండటం లేదు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ వసతి గృహాల్లో ఆహారం నాణ్యతగా ఉండటం లేదు. గత ప్రభుత్వంలో ఉన్న ఇబ్బందులే ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం గురుకులాల్లో విద్యనభ్యసించే ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి సుమారు లక్షా 25 వేల రూపాయల వరకు ఖర్చు పెడుతున్నారు. ఇంత పెద్దమొత్తంలో ప్రభుత్వ ధనం ఖర్చు అవుతున్నా ఆమేరకు విద్యార్థులకు సౌకర్యాలు లభించడం లేదు. దీనితో తరచూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురౌతున్నారు. ఏటా వందలాది మంది విద్యార్థులకు అస్వస్థతకు గురై ఆసుపత్రులలో చేరుతున్నారు. మిగిలిన పోయిన ఆహారం మరుసటి రోజు వడ్డించడం, నాణ్యమైన కూరగాయలు వినియోగించకపోవడం, వంట సమయంలో నిర్లక్ష్యంగా ఉండటం తదితర కారణాల వల్ల ఆహారం విషతుల్యంగా మారి ఆ ప్రభావం విద్యార్థులపై చూపుతోంది. ప్రధానంగా వసతిగృహాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పూర్తిగా స్థానికంగా ఉండే వార్డన్లు, సిబ్బందికి వదిలిపెట్టడంతో వారి ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. సంక్షేమ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు వసతిగృహాలను సందర్శించడం లేదు. ఒకవేళ వారు వచ్చినా ముందుగా సమాచారం ఇవ్వడం వల్ల వారు తనిఖీకి వెళ్లే సమయానికి అంతా సవ్యంగానే కనిపిస్తుంది. వసతిగృహాల్లో సమస్యను చెప్పకూడదని ముందుగానే వార్డన్లు హెచ్చరించడంతో తనిఖీకి వెళ్లే అధికారులకు వాస్తవాలు తెలియడం లేదు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలేసమయంలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఈ సమయంలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎఎన్ఎంల పర్యవేక్షణలో వైద్య చికిత్స అందించాలి. ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు పరిశీలించడం, హిమోగ్లోబిన్, విటమిన్ డి వంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితితో పాటు మానసిక స్థితిని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. దేవరకొండ మండలం కొండభీమన పల్లి శివారులో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఎలుకల బెడద అధికంగా ఉంటోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సుమారు 15 మంది విద్యార్థులను ఎలుకలు కొరకడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్‌పల్లి పెద్దాపూర్ వసతిగృహం లో అస్వస్థతతో విద్యార్థి మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. రెండు రాష్ట్రాల్లో గురుకుల, సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా హాస్టళ్ల నిర్వహణ విషయంలో ఇటీవల కాలంలో రాజకీయ ప్రభావం పెరిగింది. ఒక దశలో తెలంగాణ గురుకులాల్లో మతాలకు సంబంధించిన అంశాలు ప్రభావితం చేశాయని ఆరోపణలు వచ్చాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో దోపిడీ విధానం అధికం కావడంతో నిరుపేద విద్యార్థులకు గురుకులాల్లో చేరాల్సి వస్తోంది. అయితే ఇక్కడి పరిస్థితులు విద్యార్థులకు ఏమాత్రం అనుకూలంగా ఉండటం లేదు. గురుకులల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం లేదు. ఇటీవల గురుకులాల్లో పనిచేసే సిబ్బంది రోడ్డెక్కి ఉద్యమాలు చేశారు. అద్దె చెల్లించడం లేదని వసతిగృహాల యజమానులు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సమస్యను సరిదిద్దాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు హాస్టల్ నిద్ర అని ఒక రోజు హాస్టల్‌లో బసచేసే వారు. దీనితో అక్కడి సమస్యలుకొంతవరకు పరిష్కారం అయ్యేది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించేలేక పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు గురుకులాల్లో సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి, తగిన నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# పెళ్లి ఖర్చుల పాట్లు.. లక్షలు దాటి కోట్లు!

**కవర్ స్టోరీ**

డాక్టర్ నీలం సంపత్

పెళ్లి రెండు మనసుల కలయిక. జీవితాంతం కలిసి జీవించేందుకు ఒకరినొకరు తోడునీడగా, కడవరకు తమ బంధాన్ని కాపాడుకుంటూ జీవించడమే వివాహం ముఖ్య ఉద్దేశం. ఈ అనుబంధంలోనే ఆనందం, సుఖం దాగుంది. మానవ జాతి మనుగడకూ, పురోగతికీ ఊపిరులూదుతున్న వివాహ బంధం అత్యంత ప్రాచీనమైనదే. అందులోనూ మన దేశ సాంప్రదాయ వివాహ వ్యవస్థ మరింత బలమైనదే కాకుండ మొత్తం ప్రపంచానికే ఆదర్శంగా నిలచింది. అనాదిగా మానవ నాగరికత మనుగడకు మూలాధారంగా కొనసాగుతున్న వివాహ బంధం నూతన వధూవరుల రూపం లో స్త్రీ, పురుషులనే ఇద్దరు వ్యక్తులనే కాకుండ రెండు కుటుంబాలను సామాజిక అల్లికలో చేర్చి కుటుంబ పరిధిని పెంచుతూ ఓ ఆదర్శ సంఘజీవనానికి, సమాజ నిర్మాణానికి ఊపిరులూదుతున్న పెళ్లి వైనం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అయితే గతంలో పెళ్ళీడు పిల్లలకు కులపెద్దలు, గ్రామ పెద్దలు ,సమీప బంధుమిత్రుల ద్వారా లేదా రెండు కుటుంబాలతో ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగిన పెళ్లిళ్ల పేరయ్యల ద్వారా పెండ్లి సంబంధాలు కుదిరేవి.

నూతన పెళ్లి సంబంధాలను నిశ్చయించేటప్పుడు కుటుంబాల ఆర్థిక మూలాలతో పాటు సంఘంలో సదరు కుటుంబాలకున్న గౌరవ మర్యాదలు, పేరు ప్రతిష్టలకే అధిక ప్రాధాన్యతను ఇచ్చేవారు. సదరు పెళ్ళి సంబంధాలను కుదిర్చిన కుల పెద్దలు, బంధుమిత్రులు కేవలం హృదయపూర్వక కృతజ్ఞత ను తప్ప మరే ప్రతిఫలాన్నీ ఆశించే వారు కాదు. అదేవిధం గా పెళ్లిళ్ళ పేరయ్యలు సైతం ప్రేమతో కూడిన నామమాత్రపు సంభావనతో సంతృప్తి చెందేవారు. కాని నేటి వివాహ వ్యవస్థ లో 99శాతం పెళ్ళిళ్ళు మ్యారేజ్ బ్యూరోలు, షాదీ డాట్ కామ్‌ల ద్వారానే కుదురుతున్న నేపథ్యంలో వారికి కనీసం ఐదు, పది వేలకు తగ్గని రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు వివాహ సంబంధం కుదిరితే తక్కువలో తక్కువ యాభై వేల రూపాయల కమిషన్‌కు తగ్గకుండా వీలైతే వరకట్నంలో మూడు నుండి ఐదు శాతం కమిషన్‌ను చెల్లించాల్సి రావడం మూలాన లక్షల రూపాయల్లో వివాహ ఖర్చుల తో పెళ్ళి సంబంధాల పరికల్పన ఓ వ్యాపార సంస్కృతికి బీజం వేసింది. గతంలో అతి తక్కువ బడ్జెట్ తోనే వివాహ వేడుక కొన సాగేది.

ఓ డెబ్బై ఏళ్ల క్రితం వ్యవసాయం ప్రధానమైన మన దేశంలో జనావాసాల చుట్టూ దట్టంగా ఆవరించివున్న పచ్చటి అడవుల నేపథ్యంలో పాలపొరకతో వేసే పందిళ్లలో నే వివాహ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభమయ్యేవి. ఓ మామూలు కాగితంపై ముద్రించబడే వివాహ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రిక అతిథులకు సాదరంగా ఆహ్వానం పలికేది. పెళ్ళి జరగబోయే కుటుంబంతో పాటు వారి బంధుమిత్రులు, ఇరుగూ పొరుగు కుటుంబాల వారు ఎడ్ల బండ్లతో ఇంటి ముందు వేసే పచ్చని పందిరికి అవసరమైన పాలపొరకను పైసా ఖర్చులేకుండా ఉచితంగానే సమకూర్చే వారు. తమ తమ పొలాల్లో, పెరట్లో పూసే పూలతో పెళ్ళి పందిళ్ళను అలంకరించేవారు. ఇక శాస్త్రోక్తంగా పెళ్ళి తంతును జరిపే పూజారి సైతం నామమాత్రపు సంభావనతో కళ్యాణమస్తు, శుభమస్తు అనిపించేవాడు. ఇక విందు భోజనాల కవసరమైన అన్ని ఆహార పదార్థాలు కుటుంబ సభ్యుల ఉమ్మడి కృషితో, కుటుంబంలో అందుబాటులో వుండే పదార్థాలతోనే పిండివంటలు తయారు చేయబడేవి. స్థానికంగా అందుబాటులో వుండే బాజా, భజంత్రీలు, సన్నాయి మేళాలు, మంగళ వాయిద్యాలకు సైతం పెద్ద మొత్తంలో ఖర్చయ్యేది కాదని పెద్దలు చెప్తుంటారు. కన్నుల పండుగగా జరిగే చిరస్మరణీయమైన వివాహ వేడుకను షోకేస్ చేయడానికి నామమాత్రపు ఖర్చులతో బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు తీసేవారు. పల్లకి మీదనో, గుర్రం మీదనో జరిగే నూతన వధూవరుల పెళ్ళి తదనంతర ఊరేగింపు పెళ్ళి వారి బంధుమిత్రుల సందడితో గ్రామ్‌ఫోన్ రికార్డుల్లో మోగే సినిమా పాటలకు లయబద్ధంగా చేసే నృత్యాలతో హోరెత్తేది. ఒక్క మాటలో చెప్పాలంటే పైసా ఖర్చులేకుండ భూమినీ, ఆకాశాన్ని ఒక్కటి చేస్తూ వివాహ వేడుక తాలూకు సంబరాలు అంబరాన్నంటేవని నేడు కుటుంబ పెద్దలుగా కొనసాగుతున్న

అమ్మమ్మలూ, నానమ్మలూ, తాతలూ చెబుతున్న మాటలు అక్షర సత్యాలేనని అంగీకరించాల్సిందే.

### ఆడంబరాల కోసం తడిసి మోపెడౌతున్న పెళ్ళి ఖర్చులు

ఒకప్పుడు వివాహ వేడుకలు పూలు, పండ్లు వరపూజతో మొదలై లగ్నం, నాగవెళ్ళిల రూపంలో ఓ వారం రోజులకు తగ్గకుండా వారి వారి ఆర్థిక శక్తి కొలది వధూవరుల కుటుంబాలు వారి బంధువులూ, హితులూ, స్నేహితులతో అతి తక్కువ ఖర్చులతో ఆనందంగా జరుపుకోబడేవి. వివాహ వేడుకలో భాగం గా వరుడు వధువు మెడలో వేసే మూడు ముళ్ళూ, ఆమెతో కలిసి నడిచే ఏడడుగులూ వారి మధ్య ఏడేడు జన్మల బంధాన్ని సృష్టించే శక్తిని కలిగి వుంటాయనే నమ్మకంతో వధూవరులకు సంబంధించిన కుటుంబాలు మతాల కతీతంగా వివాహ సంబంధిత ముహూర్తాలను సెకన్లతో సహా త్రికరణ శుద్ధిగా పాటించేవారని ప్రతీతి.

సదరు ముహూర్త బలమో లేదా దాని మూలంగా ఆ జంటల మనస్సుల్లో ఏర్పడిన అచంచల విశ్వాసమో కారణమేదైనా వారి వివాహానంతర జీవితం నిండు నూరేండ్ల పాటు ఆనందంగా కొనసాగేది. ఈ క్రమంలో పచ్చని పందిరితో పాటు కుటుంబ సభ్యులూ, బంధువులం తా కలిసి తమ ఇళ్లల్లో అందుబాటులో వుండే రకరకాల ఆహార ధాన్యాలతో షడ్రసోపేతమైన తిను బండారాలను తయారు చేసి అతిథులకు ఎంతో ఆప్యాయంగా విందు భోజనా లుగా వడ్డించేవారు. వీటితో పాటు అత్తింటి వారి అతిథి సత్కారాలే పెళ్లి తాలూకు చిరస్మరణీ యమైన జ్ఞాపకాలుగా చిరస్థాయిగా వధూవరుల, వారి కుటుంబాల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేవి. మానవ సంబంధాల సామాజిక అల్లికతో ప్రతి పెళ్ళితో ఏర్పడే కొత్త కుటుంబం ఆనందకరమైన జీవితాన్ని అనుభవించగలిగేది. కాని నేడు ఆ వివాహ వేడుకలో తొలి ఘట్టమైన వివాహ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికల స్థానంలో ఎంతో విలువైన వెడ్డింగ్ కార్డ్‌లతో పాటు వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో, డిజిటల్ వీడియోల రూపంలో వివాహ ముహూర్త విషయాన్ని ఆహూతులు అతిథులకు సెల్‌ఫోన్ల ద్వార చేరవేస్తున్నారు.బంధుమిత్రుల ఇండ్లకు వెళ్లి సాంప్రదాయ బద్ధంగా వారిని వివాహానికి ఆహ్వానించడం చాలావరకు తగ్గింది. మానవ సంబంధాలు మాయమైపోతున్నాయి. పచ్చని పందిరి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆత్మీయ సమ్మేళనంతో రుచికరమైన విందు భోజనాల తయారీతో పాటు కనీసం ఓ వారం రోజులకు తగ్గకుండా జరిగే లగ్నం, నాగ వెళ్ళిల సందడి తెర మరుగైపోతోంది. నేటి ఆధునిక ప్రపంచంలో పెళ్ళి పేరుతో ఇరువురు వ్యక్తులమధ్యే కాదు, రెండు కుటుంబాల మధ్య ఓ శాశ్వత సంబంధాన్ని సృష్టించబోయే వేడుక స్వభావమే మారుతోందని పిస్తోంది. ఈనాటి స్పీడ్‌యుగంలోవివాహ వేడుక కేవలం ఒక్కరోజే కొన్ని





గంటల్లోనే లక్షల రూపాయల అద్దెతో ఏదో ఒక ఫంక్షన్ హాల్లో లేదా ఓ కన్వెన్షన్ సెంటర్లో లక్షల రూపా యల విలువతో కూడిన కేటరింగ్ సదుపాయంతో ఇన్‌స్టంట్ భోజనాలతో అతిథులను సంతృప్తి పరిచి సాగనం పే స్థాయికి చేరుకున్న ది. దీనికి మెరుగులు దిద్దడానికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ గానా బజానాతోడై అతిథులను మైమరిపిస్తోంది. అన్ని ఖర్చులు తడిసి మోపెడై రెండు కుటుంబాలపై పెనుభారాన్ని మోపుతున్న వైనం గమనార్హం. తొలినాళ్ళలో ఫోటోగ్రఫీ వచ్చిన తర్వాత మొత్తం పెళ్ళి తంతును బ్లాక్ అండ్ వైట్ ఫోటోల రూపంలో బంధించి ఆల్బమ్‌లుగా కూర్చి జీవితకాల పర్యంతం వివాహ వేడుక మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ సంతోషపడే వారు. ఆ తర్వాత కలర్ ఫోటోలు, వీడియోల ప్రవేశంతో వివాహ వేడుకల్లో వాటి ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపధ్యంలో ఈ రోజు వివాహ వేడుకలో అనివార్య మైన భాగాలుగా మారిన ప్రి వెడ్డింగ్ ఫోటో షూట్, మ్యారేజ్ ఫోటో షూట్‌లతో పాటు ఈ మధ్య కాలంలో పోస్ట్ వెడ్డింగ్ ఫోటో షూట్ రూపంలో మూడో రకం ఫోటో షూట్ కూడ పురుడు పోసుకుంటుంది. సదరు ఫోటో షూట్‌లన్నీ నూతన వధూవరుల కుటుంబాలపై లక్షల రూపాయల ఖర్చుల భారాన్ని మోపుతున్నవేననే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు.

### నిజానికి ఈ ఫోటో షూట్‌లన్నీ

మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలపై పెద్ద మొత్తంలో ఆర్థిక భారాన్ని మోపడమే కాకుండ సదరు కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు వారికి అందనంత దూరంలో ఉన్న లగ్జరీ లైఫ్ రుచి చూపిస్తున్నారు. ఫలితంగా కష్టపడే స్వభావానికి దూరమై సుందర స్వప్నం లాంటి ఈ ఫోటో షూట్‌లూ, వీడియోలు నిజం కానప్పుడు వాటిని నిజం చేసుకోవడం కోసం వధువు, ఆమె తల్లిదండ్రులపై వేధింపులు ప్రారంభ మయ్యే అవకాశాలు లేక పోలేదనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. అయినప్పటికీ తమ కలలు నిజం కాక పోతే నేరస్తులుగా మారి రాత్రికి రాత్రే ఏదో తప్పుడు పనితో డబ్బులు సంపాదించు కుని లగ్జరీగా లైఫ్‌ని గడపడానికి ప్రయత్నం చేసే ప్రమాద ముందనే మనోవిజ్ఞానవేత్తల అభిప్రాయాన్ని కొట్టి పారేయడానికి వీల్లేదు.

**నిజానికి ఈ ఫోటో షూట్‌లన్నీ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలపై పెద్ద మొత్తంలో ఆర్థిక భారాన్ని మోపడమే కాకుండ సదరు కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు వారికి అందనంత దూరంలో ఉన్న లగ్జరీ లైఫ్ రుచి చూపిస్తున్నారు.**

# మూడుముళ్ల బంధం, ఏడడుగుల అనుబంధం

భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ప్రవహిస్తున్న హిందూ సంస్కృతీ, సాంప్రదాయాల ప్రకారం వివాహ మహోత్సవంలో మాంగళ్యధారణయే అత్యంత కలక ఘట్టం కాగా ఆ మంగళ సూత్రానికి వేసే మూడుముళ్ల త్రిలోకాలు, త్రిమూర్తులు, త్రిగుణాలకు ప్రతీకలుగా మానవులు కలిగి వుండే స్థూల, సూక్ష్మకారణ అనే మూడు శరీరాలతో మమేకం కావడానికే ఈ మూడు ముళ్ల బంధమనే సత్యాన్ని హిందూ సాంప్రదాయం తేటతెల్లం చేస్తోంది. అదేవిధంగా వివాహవేడుకలో భాగంగా జరిగే హోమం చుట్టూ చేసే ఏడడుగుల ప్రదర్శనలో..అభివృద్ధి కోసం మొదటి అడుగూ..బలవృద్ధికి రెండో అడుగూ..ధనప్రాప్తికి మూడో అడుగూ..సుఖసంతోషాల కోసం నాలుగో అడుగూ..కుటుంబంతోపాటు సమాజానికి సేవ చేయడానికి ఐదో అడుగూ..కలహాలు, కలతలూ లేని కాపురానికి ఆరో అడుగూ..శారీరకంగా, మేధపరంగా ఆరోగ్యవంతమైన సంతానానికి ఏడో అడుగూ.. హిందూ సాంప్రదాయం ప్రకారం నూతన వధూవరు లుగా మారబోయే స్త్రీ, పురుషులు ఈ మూడుముళ్లు, ఏడడుగులతో ఏడేడు జన్మల వరకు ఆదర్శదంపతులుగా కొనసాగుతారని ప్రతీతి.



### వివాహ వేడుకలో కొత్త పోకడలు!

వివాహ సంబంధిత సాంప్రదాయాలు, ఆచారాల వరసలో మెహిందీ లేదా సంగీత్‌గా పిలవబడే ఓ సరికొత్త ఈవెంట్ చేరింది. ఇది ఉత్తరభారతంలో పురుడు పోసుకుని శరవేగంతో మధ్య భారతం మీదుగా దక్షిణ భారతానికి చేరుకున్న ఓ అద్భుతమైన కల్చరల్ ఫెస్టివల్. కాబోయే వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో చెవులు చిల్లులు పడే సంగీత వాయిద్యాల సవ్వడులతో ఉవ్వెత్తున ఎగసిపడే సముద్ర కెరటాల్లా మారి తమను తాము మరిచిపోవడమే కాకుండ వివాహం కన్నా ముందు జరిగే అత్యంత ముఖ్యమైన సాంప్రదాయపు మూలాలను మైమరచి గంతులేసే ఓ ఆధునిక డాన్స్ ప్రక్రియ.



ఈవెంట్ నిర్వహణ కోసం భారీ సెట్టింగ్‌ల ఏర్పాటుతో పాటు సదరు ఈవెంట్‌ను రికార్డు చేయడానికి వేలూ, లక్షల రూపాయల వ్యయంతో అత్యంత ఆధునిక కెమెరాలతో ఫోటో గ్రాపర్లూ, వీడియో గ్రాపర్లూ పోటీ పడుతారు. ఈమధ్య తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన మనవరాలి పెళ్లిలో సంగీత్ కార్యక్రమంలో వేసిన డ్యాన్స్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత విభావరితో కూడిన సదరు ఈవెంట్ నిర్వహణ కోసం ఈవెంట్ నిర్వాహకులకు లక్షల రూపాయలను చెల్లించక తప్పక పోవడం కొసమెరుపు. అయితే వర్తమాన సమాజంలో ఫోటోగ్రఫీపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్న వ్యక్తులకు ఈ కార్యక్రమము ఉపాధిని కల్పిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేక పోయినప్పటికీ మెజారిటీ ప్రజలను వాస్తవిక ప్రపంచం నుండి కన్ను తెరిస్తే కరిగి పోయే కలల లాంటి భ్రమలతో కూడిన అవాస్తవిక ప్రపంచంలోకి తీసుకెళ్తుందని చెప్పక తప్పదు. అందుకే నేటి సమాజంలో ప్రతి తల్లిదండ్రి మెజారిటీ వయస్సు వచ్చిన తమ పిల్లలను వైవాహిక జీవితం వైపు తరలించే క్రమంలో తమ శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుంటూ తిరుగులేని ఉత్పత్తి శక్తులుగా మారి నూతనంగా ఏర్పడబోయే తమ కుటుంబాలతో పాటు తమ కన్న వాళ్ళను సైతం కంటికి రెప్పలా కాపాడుకుంటూ, తమ కుటుంబాలకు ఆర్థికంగా వెన్ను దన్నుగా మారే విధంగా తీర్చిదిద్ద కుండా, పరాన్న జీవులుగా మారి భోగలాలసతతో కూడిన జీవితాన్ని అనుభవించడానికి ఉత్ప్రేరకాలుగా మారుతున్న వివిధ రకాల పనికిమాలిన సాంప్రదాయాల్ని పెంచి పోషిస్తుండడం బాధాకరం. ఆర్థిక వెసులుబాటు వున్న వారు ఆకాశంలో ఫోటో షూట్ చేసుకోవడం పట్ల ఎవ్వరికీ అభ్యంతరం లేదు. కాని దిగువ మధ్య తరగతి, అల్పాదాయ వర్గాలు ఎడారిలో ఎండ మావి లాంటి ఇలాంటి సాంప్రదాయాలకు దూరంగా వుండడమే మంచిది. లేని పక్షంలో వాటి కుటుంబాలు వరకట్న భారంతో పాటు అదనంగా ఇలాంటి అనుత్పాదక ఖర్చుల భారంతో సతమతమోతూ ఊహాజనిత మైన మాయాలోకంలోకి నెట్టివేయబడి తమ దైనందిన జీవనాన్ని సాఫీగా కొనసాగించ డానికి అవసరమైన ఆర్థిక వనరులను సంపాదించుకోవడానికి కనీస ప్రయత్నం చేయకుండ తమను తాము కథానాయకులు, నాయికలుగా భావిస్తూ కాలం వెల్లబుచ్చే ప్రమాదం లేక పోలేదు.

ఈ తరహా వ్యవహారాల వల్ల ఆర్థిక వనరులు సమృద్ధి గా వున్న వాళ్ళ కే ఇబ్బంది లేకపోవచ్చు. కాని పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ప్రదర్శన ప్రభావంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతులకు చెందిన కుటుంబాలు ప్రదర్శన ప్రభావంతో, సామాజిక ఒత్తిడితో ఈ తరహా ఫోటో షూట్‌లని అనివార్యంగా ఆదరించాల్సి రావడం సదరు కుటుంబాలకు పెనుభారంగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

## అసలేం చేయాల్సి వుంది!

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికతగా గుర్తించబడిన ఈజిప్ట్‌లోని మొసపుటేమియా నాగరికత తర్వాత అంతే ప్రాచీన నాగరికతగా పేరుగాంచిన హరప్పా,మొహంజోదారో మరియు సింధు నాగరికతలే పునాదులుగా.. అనాదిగా ప్రపంచంలోనే అత్యంత సుస్థిరమైన, ధృఢమైనదేగాక ఎంతో పవిత్రమైన వివాహ వ్యవస్థగా భారతీయ వివాహ వ్యవస్థ పేరుగాంచిన వైనం గర్వకారణం. అందుకే ఈనాడు ప్రపంచ దేశాలన్నీ భారతీయ వివాహ వ్యవస్థ వైపు ఆకర్షితులౌతున్నాయని అంగీకరించక తప్పదు. భారతీయ సాంప్రదాయం ప్రకారం పెళ్ళిళ్ళకు అనువైన శుభదినాలలో అధిక డిమాండ్, దానికి సరిపడా సప్లయ్‌లేని నేపథ్యంలో వివాహ వేడుకలు జరిగే ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్ సెంటర్లు అధిక అద్దెను చార్జ్ చేస్తున్న వైనం బాధాకరం.శాస్త్రోక్తంగా వివాహ తంతును పూర్తి చేసే పూజారులు సైతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వలె గంటా రెండు గంటల తంతుకు వేలల్లో సంభావన తీసుకుంటున్న వైనం గమనార్హం. అయితే ఆధునిక భారతంలో వివాహ వేడుకకు సంబంధించి రెండు కుటుంబాలు అనుత్పాదక స్వభావం కలిగిన అధిక ఖర్చుల ఊబి లోకి నెట్టివేయబడి అప్పుల భారాన్ని మోయాల్సి వస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.



అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో తగ్గుతున్న రూపాయి విలువతో దేశంలో ఆకాశమే హద్దుగా పెరుగు తున్న ధరల మూలాన వరులూ, వారి తల్లిదండ్రు లూ,వారి కుటుంబాల గొంతెమ్మ కోరికలను తీర్చే క్రమంలో లక్షలాది రూపాయల వరకట్నంతో పాటు ఆకాశా న్నంటుతున్న ధరలలో కట్న కానుకలూ,పెట్టుబోతల రూపం లో పెట్టాల్సి వస్తున్న బంగారం, వెండి ఇతర వస్తు, వాహ నాలు, వంట పరికరాలు, గృహోపకరణాలు,పట్టు చీరలు, యల్.ఇ.డి, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనర్‌ల లాంటి రకర కాల ఎలక్ట్రానిక్ వస్తువులను సమకూర్చాల్సి రావడం మూలాన వధువు కుటుంబం అప్పుల పాలు గాకతప్పడం లేదు. ఆధునిక భారతీయ సమాజంలో ప్రతి కుటుంబం తమ చుట్టూ ఆవరిం చివున్న సాంఘిక పర్యావరణం లో జరుగుతున్న వివాహ వేడుక ల్లో భాగం గా కొనసాగుతున్న మెహెందీ, సంగీత్, ప్రి వెడ్డింగ్, వెడ్డింగ్,పోస్ట్ వెడ్డింగ్ ఫోటో షూట్‌ల లాంటి ఆర్భాటాలతో పాటు లక్షల రూపాయల అద్దెని చెల్లిస్తూ హై క్లాస్ ఫంక్షన్ హాల్స్,అత్యంత ఆధునిక కన్వెన్షన్ సెంటర్లలో కళ్ళు మిరుమిట్లు గొలిపే దీపకాంతులతో మ్యూజికల్ ట్రూప్ లతో నార్త్, సౌత్,మొగలాయీ వెజ్,నాన్ వెజ్ వెరైటీలలో రకరకాల వంటకాలతో లక్షల రూపాయల విలువైన విందు భోజనాల ఏర్పాటు చేస్తున్నారు. సమాజంలో పనికి రాని గొప్పల కోసం, అనవసర ఆర్భాటాల కోసం లక్షలాది రూపాయలను దుబారాగా ఖర్చుచేస్తున్నారు.

వివాహ వేడుకకు హాజరయ్యే అతిథుల సంఖ్యపై సరైన అంచనా లేకుండ పెద్ద మొత్తంలో వంటలు చేయడంతో పాటు హాజరయ్యే అతిథులు సైతం క్రమశిక్షణతో భోజనాలు చేయని నేపథ్యంలో వండిన ఆహార పదార్థాలలో 20కి పైబడి కోట్ల రూపాయల విలువైన ఆహార పదార్థాలు చెత్త కుండీల్లోకి వెళ్ళి పోతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.మరోవైపు కోట్ల సంఖ్య లో ఈ దేశ ప్రజలు తమ ఆకలిని తీర్చుకోవడానికి అవసరమైన ఆహార పదార్థాలు లభ్యం కాక ఆకలి చావులకు బలౌతున్న వైనం ఓ సామాజిక విషాధంగా భావించక తప్పదు.

వివాహ వేడుక కోసం అనవసర, అనుత్పాదక ఆర్భాటాల కోసం లక్షలాది రూపాయలను ఖర్చుచేసినా నూతన వధూవరుల మధ్య శాంతియుత,ఆదర్శ దాంపత్య జీవనానికీ అణు మాత్రం దోహదపడని నేపథ్యంలో వారి దాంపత్య జీవనంలో పొరపొ చ్చాలు తలెత్తుతున్న వైనాన్ని ఇటీవలే ఎంతో లోతుగా అధ్య యనం చేసిన భారత దేశ సర్వోన్నత న్యాయ స్థానం దేశం లో వివాహాలన్నింటినీ అనివార్యంగా చట్ట బద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ందేనని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో మన దేశం లో పెళ్ళి నూరేండ్ల పంటగా మారడం అటుంచి రెండు కుటుంబాలను అప్పుల కుంపట్లోకే తోసివేస్తున్న భరించ లేని మంటగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితులు మారాలంటే భారతీయ సమాజంలో పెళ్ళీడు పిల్లల తల్లిదండ్రులు పెళ్ళి వేడుకల్లో పోటా పోటీగా తోటి వాడు తొడ కోసుకుంటే మనం మెడ కోసుకుంటామనే చందంగా అనవసర ఆర్భాటాల నెపంతో చేస్తున్న దుబారా ఖర్చులను వీలైనంత వరకు తగ్గిస్తూ నూతన వధూవరుల సుస్థిర ఆర్థిక భవిష్యత్‌కు పునాదులు వేసే స్థిరాస్తులు గానో లేదా ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో పెట్టుబడు లుగానో మార్చితే దేశంలో ప్రతి పెళ్ళీ నూతన వధూవరుల పట్ల నిజంగా నూరేండ్ల పంటగా మారుతుం దని చెప్పక తప్పదు.నేటి పొదుపు రేపటి మదుపుగా మారి ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితుల అభివృద్ధికి మేలు మలుపుగా మారుతుందనేది చరిత్రలో అనేకసార్లు ఋజువైన సత్యమే.

కొవిడ్ కల్లోలం తర్వాత కకావికలమైన తన ఆర్థిక మూలాల ను తిరిగి పునరుజ్జీవింప చేసుకోవడానికి చైనాలో లీ అనే యువతి ప్రారంభించిన సేవింగ్ డాజీ పొదుపు ఉద్యమమే ప్రేరణగా పెళ్ళీడు కొచ్చిన పిల్లల తల్లిదండ్రులు తమ నెల వారీ సంపాదనలో దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ తొంభై శాతం పొదుపు చేయలేక పోయినా కనీసం తమ పిల్లల పెండ్లి ఖర్చులలో యాభై శాతం దుబారా ఖర్చులను తగ్గించు కోగలిగినా సదరు కుటుంబాల ఆర్థిక పరిస్థితులు అసాధారణ రీతిలో మెరుగు పడడంతో పాటు పెళ్ళి నూతన వధూవరుల పాలిట నూరేండ్ల పంటగా మారుతుందనే దాంట్లో ఎలాంటి సందేహం లేదు.



పిల్లలకైనా పెద్దలకైనా గింజలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని గుమ్మడి, దోస, అవిసె, పొద్దు తిరుగుడు... ఇలా రకరకాలవి ఇంట్లో తెచ్చిపెడుతుంటారు చాలామంది. అయితే ఎన్నిరోజులు చూసినా ఆ గింజలు అంతే ఉంటాయి తప్ప తరగవు. ఎందుకంటే జీడిపప్పుల బాదం పప్పులూ, కిస్మిస్‌లు ఉన్నంత రుచిగా అవి ఉండవు కాబట్టి గబుక్కున నోట్లో వేసుకోలేరు. అందుకే ఇప్పుడు ఆరోగ్యానికి మేలు చేసే ఈ గింజలు కూడా పలు రకాల రుచుల్లో నోరూరిస్తూ మార్కెట్లోకి వచ్చేశాయి.



# ఆరోగ్య గింజలు

డాక్టరు చెప్పారనో, పోషకాహార నిపుణులు సలహా ఇచ్చారనో, జిమ్ ట్రైనర్ తినమన్నారనో చాలామంది ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో గింజల్ని కూడా ఓ భాగం చేసుకోవాలనుకుంటారు. అందుకోసం అవిసె, గుమ్మడి, దోస, పుచ్చ, పొద్దుతిరుగుడు తదితర గింజల్ని ఆవేశంతో భారీ మొత్తంలోనే తెచ్చి పెట్టుకుంటారు. ఉత్సాహం కొద్దీ వాటిని రోజుకో రకం చొప్పున ఓ నాలుగు రోజులు బాగానే తింటారు. ఆ తరవాతే మొహం మొత్తేస్తుంది. ఏ రుచీ లేని గింజల వైపు కూడా చూడాలని అనిపించదు. పెద్దవాళ్లంటే ఏదోలా తినడానికి ప్రయత్నిస్తారుగానీ చిన్నారుల చేత తినిపించడం బ్రహ్మ తరం కూడా కాదు. అందుకే మరి చాక్లెట్ల మాదిరి తియ్యగానో, చక్కెర అద్దినంత కమ్మగానో, తేనెలా మధురంగానో.. టీ టైమ్‌లో తినడానికి కారంకారం గానో, ఉప్పూ పులుపూ కలబోసిన రుచుల్లోనో ఉంటే ఎంత బాగుంటుందో కదూ. గింజలు నింపిన డబ్బాలు ఇట్టే ఖాళీ అయిపోవడం ఖాయం. కాబట్టే ఆరోగ్యాన్ని పంచే ఈ గింజల్ని పలు రుచుల్లో ముంచేసి అందిస్తున్నారు.



డార్క్ చాక్లెట్ ఒత్తిడిని పోగొట్టి ఉపశమనాన్నిస్తుందని చెబుతుంటాయి అధ్యయనాలు. మరి అలాంటి డార్క్ చాక్లెట్ పూతలో ఒదిగిపోయి తియతియ్యగా నోరూరిస్తున్నాయి గుమ్మడీ, దోస, అవిసె వంటి గింజలు.



చిన్నారులకు చక్కెర రుచులంటే ఎంతిష్టమో మాటల్లో చెప్పలేం. చిన్నచిన్నగానూ, రకరకాల రంగుల్లోనూ ఉండే చక్కెర గోళీలు చాలామందికి తెలిసినవే వీటినే సరదాకి బల్లిగుడ్లు అని కూడా పిలుస్తుంటారు. కొందరు, ఇప్పుడు అచ్చం వాటిలానే రకరకాల రంగుల్లో చక్కెర పూత అద్దుకుని చూడచక్కగానూ, చిన్నారుల చేత తినిపించేలానూ మార్కెట్లోకి వస్తున్నాయి. తేనె రుచీ, యాలకుల సువాసనతోనూ జత కడుతున్నాయి పలు రకాల, సీడ్స్ సహజరంగుల కలబోతగా వస్తూ.. నోరు తీపి చేసే మిఠాయిల్లా కనిపించే వీటిని గింజలంటే ఎవరూ నమ్మరు. నమిలితింటేనే తెలుస్తుంది. అయితే ఎంత సేపూ తియ్యని రుచుల్లోనేనా.. అనుకునేవారి కోసం ఉప్పూ, కారం, నిమ్మ, వంటి మసాలా రుచుల్లో కూడా పొద్దుతిరుగుడు, అవిసె, దోస, గుమ్మడి, క్వినోవా వంటి గింజల్ని తీసుకొస్తున్నాయి కొన్ని సంస్థలు. కారంగా కరకర లాడించే వీటి రుచి కూడా ఎంతో బాగుంటుంది. అలానే నువ్వుల విషయానికొస్తే సహజంగా వాటిని ఎవరూ నేరుగా తినరు. వాటితో చిక్కీలూ, లడ్డూలూ, ఇతరత్రా స్వీటూ తయారు చేసుకుంటారు. కారంపొడి చేసి అన్నంలో కలిపి తీసుకుంటారు. ఇప్పుడు అవన్నీ చేసుకునే తినాల్సిన పనిలేదు. నేరుగా కూడా తినేసేలా వస్తున్నాయి. రోజ్ మి చాక్లెట్ రుచుల్లోనూ యాలకుల సువాసనతోనూ దొరుకుతున్నాయి. రోజుకు ఒకట్రెండు చెంచాలు నోట్లో వేసుకున్నారంటే నువ్వుల్ని కరకరా నమిలిపారేయొచ్చు. ఇక, అన్నం తిన్నాక చాలామంది. సోంపు తినే అలవాటు ఉంటుంది. ఇప్పుడు ఆ సోంపుతో జతకట్టి మసాలా, చక్కెర రుచుల్లో.. ఎమౌత్ ఫ్రెషనర్‌గా అవతారమెత్తుతున్నాయి అవిసెగింజలు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచి చెడు కొలెస్ట్రాల్ని దూరం చేసి చర్మానికీ, జుట్టుకీ ఎన్నోవిధాలుగా మేలుస్తాయి ఆ గింజలు. ఇంకా ప్రొటీన్లూ, విటమిన్లూ, ఖనిజ పదార్థాలూ సమృద్ధిగా లభించే ఇతరత్రా గింజల్నీ అన్ని వయసులవారూ తీసుకోవచ్చు. నచ్చిన రుచుల్లో ఉండే మెచ్చిన గింజల్ని తెచ్చుకుని తినేయండి హాయిగా..

# పంటంతా నలుపే



బియ్యం, బంగాళాదుంపలు, మిర్చి, అల్లం, పసుపు.. ఇలా చెప్పుకుంటూపోతే ఒక్కో పంట ఒక్కో రంగులో ఉంటుంది. అయితే ఉత్తరప్రదేశ్‌లోని మన్సూర్పర వాసి రవి ప్రకాశ్ మోర్య ఇంటికి వెళితే అతను పండించేవి ఏవైనా సరే నల్ల రంగులోనే ఉంటాయి. టొమాటోలూ, గోధుమలూ, ఆలూ, క్యారెట్, బియ్యం, మిర్చి, అల్లం, పసుపు తదితర పంటలన్నీ నలుపు వర్ణంలోనే పండుతాయి అతని పొలంలో. ఏమిటీ రంగుల వైవిధ్యం అనడిగితే తన కుటుంబంలోని విషాదగాథను చెప్పేస్తాడు. పదేళ్ల క్రితం రవి తండ్రి కేన్సర్‌తో మరణించాక అందుకు కారణాలు వెతికాడు. శరీరంలోని వ్యర్థాలను దూరం చేసే ఆంత్రో సైనిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కేన్సర్‌లను



దూరం చేస్తాయనీ అవి నలుపు వర్ణంలో ఉండే కాయగూరల్లో లభిస్తాయనీ తెలుసుకున్నాడు. అప్పట్నుంచీ నలుపు రంగు పంటల్నే పండించడం లక్ష్యంగా పెట్టుకుని విదేశాల నుంచి విత్తనాలు తెప్పించి మరీ సాగు చేస్తున్నాడు. దాదాపు పదిరకాల నల్లపంటల్ని పండిస్తూ వైవిధ్యంగా ఆలోచించిన రవి మనదేశంలోని పదిహేను రాష్ట్రాల్లోని రైతులకు ఆ విత్తనాలను సరఫరా చేస్తూ లాభాలూ పొందుతున్నాడు.

# ఉబర్ ఆప్‌లో ఒంటెలు

ఎక్కడికైనా వెళ్లాలి అనుకున్నప్పుడు లేదా దారి మధ్యలో వాహనం చెడిపోయినప్పుడు వెంటనే ఆప్ ఓపెన్ చేసి కారు, ఆటో, బైక్ వంటివి బుక్ చేసుకుంటాం. ఇలాంటి సౌకర్యం నగరాల్లో ఉంటుంది గానీ పల్లెల్లోనూ, ఎడారి ప్రాంతాల్లోనూ ఉండటం చాలా కష్టం. అయితే దుబాయ్‌లోని అల్ బదాయెర్ ఎడారి ప్రాంతం జనజీవనస్రవంతికి దూరంగా మారుమూలన ఉంటుంది. అలాంటి చోట కూడా ఉబర్ సేవలు అందిస్తోంది. ఆ ఎడారిని చుట్టి రావాలన్నా, మధ్యలో ఎవరైనా చిక్కుకుపోయినా ఉబర్ ఆప్ లోకి వెళితే ఒంటెలు ప్రత్యక్షమవుతాయి. ఆటో, కారు, బైక్ మాదిరే అక్కడ ఒంటెను బుక్ చేసుకుంటే వెంటనే మన వద్దకు వచ్చేస్తుంది. ముగ్గురు నలుగురు ఉంటే ఒకేసారి రెండు మూడు ఒంటెలను కూడా బుక్ చేయొచ్చు. అలా, ఇప్పుడు అక్కడ ఒంటెల మీద ఆధారపడే వారంతా ఈ విధంగా ఎంచక్కా టెక్నాలజీని నమ్ముకుని జీవిస్తున్నారట.



# ఉచితంగా గ్యాస్

ప్రస్తుతం విలాసవంతమైన అపార్టుమెంట్లూ, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండేవారికి గ్యాస్ కనెక్షన్ అవసరం లేదు. పైపుల్లో నీళ్ల వచ్చినట్టే గ్యాస్ కూడా అదే మాదిరి వంటింట్లోకే వచ్చేస్తుంది. తరచూ గ్యాస్ బుక్ చేసుకోవడం, ఉన్నట్టుండి అయిపోతే ఇబ్బంది పడటం వంటి సమస్యలు లేకుండా ఇలా ఉంటే ఎంతో బాగుంటుంది కదూ! పంజాబ్లోని హోషియార్పుర్ జిల్లా లాంబ్రా గ్రామానికి వెళితే అక్కడున్న దాదాపు ప్రతి ఇంటికీ గ్యాస్ పైపులైన్ ద్వారానే అందుతుంది.



అలాగని వాళ్లేమీ ధనవంతులుకాదు, నిరుపేద రైతుకూలీలు. ఊరికి చెందిన జస్వీందర్ సింగ్ పేదలకు గ్యాస్ కనెక్షన్ తీసుకునే స్థోమత లేకపోవడం, టన్నుల కొద్దీ పేడ వృథా అవ్వడం గమనించి పంజాబ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డునీ, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నీ సంప్రదించి వారి సాయంతో ఓ బయోగ్యాస్ ప్లాంట్ను ఏర్పాటు చేయించాడు. సుమారు 300 ఏరియాలకు ఈ ప్లాంట్ నుంచి పైప్‌లైన్ వేయించి కనెక్షన్లు ఇప్పించాడు. ఆ గ్రామంలోని కొందరు సభ్యులు ఓ టీమ్‌గా ఏర్పడి ప్రతి ఇంటి నుంచీ పేడను సేకరించి ప్లాంట్లో వేసి ప్రాసెస్ చేస్తారు. అలా చేయడం వల్ల గ్రామం మొత్తానికి, అవసర మైన గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. అందుకు ప్రతి ఇంటి నుంచి నెలకి రూ.150 వసూలు చేస్తారు. వ్యర్థానికి అర్థం చెబుతూ వనరుగా మార్చుకుంటున్న లాంబ్రా వాసులు ఎందరికో ఆదర్శం కదూ!

# కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకర మైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పని సరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్
మిల్స్ పక్కన, హైదరాబాద్- 80

sunmagvaartha@gmail.com



# ఇంకెన్నాళ్లీ మూసీ మురికి..

ఇంకెన్నాళ్లీ మూసీ మురికి
విముక్తి లేదా.. పేద
ప్రజలకు
ఆ దుర్వాసనకలవాటైరి
ఆరోగ్యాలు పాడైపోవు.
మంచి పని చేయదలచిన
ప్రభుత్వానికి అండదండగా
‘ఐకమత్యమే మహా బలమ్ము’గా
సహకరిస్తూ ముందుకు పోదాం.
కలిసిరాని పార్టీలను ఒంటరి చేస్తూ
సాగుదాం ముమ్ముందుకే
అపుడే మన భాగ్యనగరం
విశ్వనగరమై విలసిల్లునుగా.
ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులు,
ప్రజలు–జీవరాసులు బాగుపడు
రోగాల బారిన పడకుండా
ఆరోగ్యవంతులై జీవింతురుగా.
మూసీ నది ప్రక్షాళన/పునరుజ్జీవం
బృహత్తర శుభ కార్యంబౌ
ఈ కార్యం సవ్యంగా నెరవేరితే
మూసీ పరివాహకం–పర్యాటక
కేంద్రంబౌ.
మూసీ నది మురికి నుండి
విముక్తులైన నిరుపేద
ప్రజలకు
పునరావాసం–ఉపాధి మార్గం
చూపించి
పిల్లల విద్యార్జనకై పాఠశాలలో
చేర్పించాలి.
సుందరీకరణ చేసేదెవరో
అది భావి తరాలకు
తరగని నిధియౌ
హైదరాబాద్ ఆణిముత్యమౌ
సుదూర గమ్యం బహు సౌందర్యం
ఆయా ప్రభుత్వాల కీర్తి ప్రతిష్ఠలు
నవ తెలంగాణ చరిత్రలో
సువర్ణాక్షరాలతో లిఖించబడుగా!

– కౌముది సుధాకర్



ఈవారం కవిత్వం

# ఓ రాత్రి

పగలు ప్రసవించిన వెలుగులను
రాత్రి దుప్పటి కప్పేస్తుంది
పగలంతా అలసిన కళ్లు
అవుతాయి విశ్రాంతి గుడారాలు!


రాత్రంతా కనురెప్పల కౌగిలింతలు
మనసంతా కలల పంటలు
జ్ఞాపకాలు దోబూచులాడుతాయి
నిన్నటివే కాదు చిన్నప్పటివి కూడా!

ఓ రాత్రంతా ఆనందం వెల్లువిరిస్తుంది
మరో రాత్రి ఎంతో ఆవేదన రోదన
ఆవేశాలు వద్దని ఆదేశాలు
సహనంగా ఉండాలని సందేశాలు!

రేపటి పనుల సంపుటి
ఈ రాత్రే ముద్రించబడుతుంది
మంచీ చెడులకు రాత్రంతా
చర్చావేదిక అవుతుంది!

రాత్రికి ఆలోచనల కుంచెలు
రేపటి భవిష్యత్తును చిత్రీకరిస్తాయి
రాత్రి బోధివృక్షం అవుతుంది
ఎంతో జ్ఞానోదయాన్ని కలిగిస్తుంది!!

– జగ్గయ్య.జి



# గ్రంథాలయం

జ్ఞాన భండాగారం
గ్రంథాలయం
పుస్తకాల నిలయం
విజ్ఞాన సంపద
మనిషి వికాసానికి మూల స్తంభాలు
సమాచార కేంద్రం గ్రంథాలయం.



బంగారు భవిష్యత్తుకు బాటలు
బాలల వినోదాల గ్రంథాలయం
తరతరాల విజ్ఞాన సంపద
మనిషిని మనీషిగా మార్చేది.

సరస్వతి నిలయం గ్రంథాలయం
భవితకు బాట గ్రంథాలయం
అక్షరాల ఆలయమది
పుస్తకాల పరిచయం అది.

విలువలెన్నో నేర్పుతుంది
విజ్ఞానులను చేస్తుంది
పాఠకులకు జ్ఞాన సంపద
సమాజ వికాసానికి మూలస్తంభాలు.

– దేవులపల్లి రమేశ్

# పుస్తక సమీక్ష




## 'సుప్రభాత భావనలు వెదజిమ్మే అక్షర కిరణం'

ఈ పుస్తకాన్ని రచయిత తన మిత్రుడు పెద్దూరి వెంకటదాసుకు అంకితం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి, ప్రముఖ కవి, విమర్శకులు రమణ వెలమకన్ని చక్కటి విలువైన ముందు మాటలు రాసారు. ఆకాశవాణి కేంద్రంలో ప్రసారమైన 19వ్యాసాలు, ఒక రాజకీయ మాసపత్రికలో ప్రచురణ అయి పాఠకుల ఆదరాభిమానాలు పొందిన 17 వ్యాసాలు (మొత్తం-36) ఈ పుస్తకంలో ప్రచురించారు. రచయిత యిప్పటికే 12 పుస్తకాలు వివిధ ప్రక్రియల్లో ముద్రణ చేసి పాఠకుల ఆదరణ పొందారు. తొలిసారి గా ఎన్నికల ద్వారా ఈ దేశంలో ఒక కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి, సిపిఎంకు సారథ్యం వహించిన నంబూద్రిపాద్ వ్యాసం, లెనిన్‌పై రాసిన వ్యాసాలు చరిత్రకు అద్దంగా నిలుస్తాయి. తన సొంత పొలాన్ని పేదలకు పంచి ఇవ్వడం-నాటి తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించడం నెహ్రూ కన్నా ఎక్కువ మెజారిటీతో గెలుపు సాధించడం గొప్ప విషయాలు. సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉండి..6లక్షల ఎకరాలు భూమి పంపిణీ చేయడం, రైతులకు పంచడం గొప్ప విషయం. యువత వ్యక్తిత్వ వికాసానికి చక్కటి కరదీపిక ఈ పుస్తకం. రచయితకు అభినందనలు.

**(సుప్రభాత భావనలు, రచన: పొత్తూరి సుబ్బారావు, వెల: రూ150, ప్రతులకు: సాహితీ కిరణం, 11-13-154, అల్కపురి, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**




## చీకట్లను పారదోలే 'సంధ్యాదీపాలు'

డా॥ఈటెల సమ్మన్న విద్యాధికుడు. విద్యాబోధనం, తలపండిన అనుభవం ఆయనది. ఓ కారు ప్రమాదంలో కుమారుడ్ని కోల్పోయిన దురదృష్టవం తుడు. సామాజిక సేవలో సేదతీరుతున్న తాత్వికుడు. కవిత్వం సమ్మన్నకు వ్యాపకం కాదు...ధ్యానం, తపస్సు, సాంత్వన పొందే సాధనం. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తు సమాజంలోని చీకట్లను పారదోలడానికి 'సంధ్యాదీపాలు' వెలిగిస్తున్నాడు. కవితలన్నీ వెలుగులు విరజిమ్మే దివ్వెలుగా మిరుమిట్లు గొలుపుతాయి. 'ప్రభూ, దేవా, పరమాత్మా' అటు సర్వాంతర్యామిని, మనసులను ముసురుకుంటున్న తిమిర పొరలను ఛేదించేశక్తిని ప్రసాదించమని వేడుకుంటున్నాడు. సమాజంలో పాతుకుపోయిన సంకుచితత్వం, మతోన్మాదం, మారణహోమం, విద్వేషవిషం, ప్రభుత్వ ఉదాసీనత రూపుమాపవలసిందిగా భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాడు. రాజ్యాంగ విలువలను సెక్యులర్ పవిత్రతని పరిరక్షించమని భగవంతుడి పాదాలముందు మోకరిల్లుతాడు. ముక్తిసాధన భగవత్ చింతనతోనే సాధ్యమవుతుందని సమ్మన్న ప్రగాఢ విశ్వాసం. దైవం అనేది ఓ భావన నమ్మకం. మనకు కనబడని శక్తి ఒకటి ఉందన్నది మాత్రం నిజం. ఆ శక్తి ఒక్కొక్కరికి ఒక్కో రూపంలో సాక్షాత్కరిస్తుంది. 'మానవసేవే మాధవ సేవ'గా గుర్తెరిగి అనేక స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుడిగా సేవలందిస్తున్న కవి సామాజిక కార్యకర్త ఈటల సమ్మన్న ఆదర్శప్రాయుడు..అభినందనీయుడు.

**(సంధ్యాదీపాలు, రచన: డా॥ సమ్మన్న ఈటెల, వెల: రూ 100, ప్రతులకు: 207, సిరి రెసిడెన్సీ, స్ట్రీట్ నం.2, తార్నాక హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

ఐహికము, ఆముష్మికము అని జీవనవిధానాలు రెండు. మొదటి విధానంలో భౌతికమైన జీవయాత్ర కొనసాగించుట, ఇల్లూ పిల్లలు భార్య, తల్లిదండ్రుల మధ్య గడపటం ఉంటుంది. రెండవ విధానంలో, మొదట చెప్పిన విషయ వాసనలకు అతీతంగా ఉంటూ ఆధ్యాత్మిక జీవనం గడుపుట. కందాళై రాఘవాచార్య బాల్యం నుండే ఆధ్యాత్మిక జీవనంపై ఆసక్తి చూపించేవారు. ఆర్యామూర్తుల ఆరాధన చిన్ననాటి నుండే చేసేవారు. అనేక దివ్యస్వప్నాలు వచ్చేవి. దేవతామూర్తులు వీరితో మాట్లాడుతున్న అనుభూతులకు లోనయ్యేవారు. కళాశాల జీవితంలో



## యోగసాధనకు కరదీపిక

సహచరుడు గంగారాం ద్వారా వీరికి లింగాల నారాయణగౌడ(1926-1994) అను మోర్తాడ్ (నిజామాబాద్ జిల్లా) వాసి, నిర్వికల్ప సమాధి పొందిన గురుదేవుల పరిచయం అవుతుంది. ప్రథమ సమావేశంలోనే రాఘవాచార్యులు గురుదేవుల ప్రతిభావిశేషాలు 'దివ్యప్రకంపనల' రూపంలో ప్రకటితం అవుతాయి. అయస్కాంతం వల్ల లాగబడిన ఇనుపముక్కవలె ఆకర్షితుడవుతాడు రచయిత. గురుదేవుల ప్రేరణ, మార్గదర్శకత్వం వల్ల 'నిర్వికల్ప సమాధి' పొందుతారు. 25 అధ్యాయాలు, 84 పేజీల ఈ చిరుపొత్తంలో రచయిత తన బాల్యానుభవాలు, ధ్యానవిశేషాలు, తాను ఎలా సాధింపగలిగినారో, అతిసరళమైన భాషలో సంక్షిప్తంగా వివరించారు. ఐహిక జీవితాలకు కూడా, వీరి వివరించిన ధ్యానం సాధన, మంచి బాటసారి.

**(విశ్వధ్యానం, యోగసాధన, రచన: కందాళై రాఘవాచార్య, వెల: రూ 100, ప్రతులకు: పాలపిట్ట బుక్‌హౌస్, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

'కులం ప్రత్యామ్నాయ సంస్కృతి' గ్రంథాన్ని డాక్టర్ కత్తి పద్మారావు, దళిత ఉద్యమాలు రాజ్యాధికారాన్ని సాధించే వైపు ప్రయాణం చేయాలని డా॥అంబేద్కర్ భావజాలాన్ని తాత్త్విక విశ్లేషణ

## కత్తిపద్మారావు-దళిత రాజ్యాధికారం



గా ఆలోచింపచేయడం ఎంతైనా అభినందనీయం. హిందూ కులవ్యవస్థను కూల్చి, ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించి, దళితుల రాజ్యాధికారానికి సాగిపోయే సమర కార్యాచరణలో డా॥పద్మారావు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. డా॥అంబేద్కర్ కులం పునాదుల మీద జాతిని, నీతిని నిర్మించడం అసాధ్య మని మానవాభ్యుదయానికి కుల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన తాత్త్విక దార్శనిక మేధావి. భూస్వామ్యకులాధిపత్యం, కమ్యూనిస్టు ఉద్యమాలు, కుల నిర్మూలనా సిద్ధాంత చర్చలు, బౌద్ధ సంస్కృతి, సిద్ధాంతకర్తలు మహాత్మాఫూలే, పెరియార్ రామస్వామి నాయకర్ ఆశయవిశేషాలు, దళిత ఉద్యమతాత్త్విక భూమిక, దళిత సంస్కృతి ప్రణాళిక డా॥పద్మారావు సమగ్ర మేధావిగా విశ్లేషించారు. 7 ఆచరణ సూత్రాలు, దళితుల రాజ్యాధికారాన్ని రూపొందించుకొనే దిశలో, ప్రత్యామ్నాయ సంస్కృతికి దళితుల రాజ్యాధికారమే అంతిమధ్యేయంగా సాగాలని డా॥పద్మారావు ప్రగాఢంగా విశ్వసిస్తూ ప్రణాళికను మనముందుంచారు.

**(కులం ప్రత్యామ్నాయ సంస్కృతి, రచన: డా॥ కత్తిపద్మారావు, వెల: రూ 200, ప్రతులకు: కత్తిస్వర్ణకుమారి, లోకాయుత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు)**

**- యర్రమిల్లి**



# మహిళా బాడీ బిల్డర్ ఎస్తేరు

షేక్ అబ్దుల్ హకీం జాని

నేడు మహిళలు అన్ని రంగాలలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అందాల పోటీలతో పాటు కొన్ని రకాల క్రీడలలో వస్త్రధారణ విషయంలో తీవ్రస్థాయిలో విమర్శలను ఎదుర్కుంటూ అవమానాలు పొందిన వారు కూడా ఉన్నారు. ముఖ్యంగా శరీరసౌష్టవ పోటీలలో మహిళలు రాణించాలంటే గుండె ధైర్యం కావాలి, మనదేశంలో హర్యాణ, మహారాష్ట్ర వంటి కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో బాడీబిల్డింగ్‌లో కొందరు మహిళలు రాణిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాలలో బాడీ బిల్డింగ్ రంగంలో ఆశించిన స్థాయిలో మహిళలు ముందుకు రావడం లేదు. ఈ తరుణంలో రావూరి ఎస్తేరు రాణి ఈ రంగాన్ని ఎంచుకుని అనేక అవమానాలను ఎదుర్కొంటూ, తన ప్రతిభను నిరూపించుకోవాలని ఆరాటపడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా బాడీ బిల్డర్‌గా ప్రశంసలందుకుంటున్నారు. దళితురాలైన ఎస్తేరు రాణి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ, పొలం పనులు చేస్తూ, ఆకుకూరలు అమ్మి జీవనం సాగిస్తూ బాడీ బిల్డింగ్‌లో తన సత్తా చాటుతున్నారు.

## బాల్యం నుండి అన్నీ కష్టాలే

ఎస్తేరు రాణికి కష్టాలు బాల్యం నుండి వెన్నంటి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా వేమూరు గ్రామానికి చెందిన ఎస్తేరురాణి బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. ఈమెకు ఒక తమ్ముడు ఉన్నాడు. అనాథలుగా ఉన్న సమయంలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న నాయనమ్మ రావూరి సరోజిని చేరదీసి వీరిద్దరి పోషణా భారాన్ని స్వీకరించారు. 'నీ కుమారుడుడే చనిపోయినప్పుడు అతని బిడ్డల భారం నువ్వు ఎందుకు మోయాలి?' అని నాయనమ్మను ప్రశ్నించిన గళాలు అనేకం. వీటిని నాయనమ్మ సరోజిని పట్టించుకోలేదు. కుమారుడి బిడ్డలను సాకి విద్యా బుద్ధులు నేర్పించసాగారు. అదనపు ఆదాయం కోసం నాయనమ్మ ఆకు కూరలు అమ్మేవారు. ఎస్తేరు రాణి ఆమె బాటలో నడుస్తూ ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే ఖాళీ సమయాలలో పొలం పనులకు వెళుతూ, ఆకు కూరలు అమ్మి వచ్చిన ఆదాయంతో క్రీడా పోటీలకు వెళ్ళేందుకు ఉపయోగించే వారు. తాను కష్టపడి సంపాదించిన ధనాన్ని ఏనాడు ఆడంబరాలకు, విలాసాలకు, అలంకరణలకు ఎస్తేరు ఉపయోగించలేదు. వేమూరులో పాఠశాల విద్యను పూర్తి చేసుకుని గుంటూరు ఏసి కళాశాలలో ఇంటర్ చేరారు. పాఠశాల దశలోనే సాఫ్ట్‌బాల్, హామర్ త్రో, అథ్లెటిక్స్‌లో మంచి ప్రావీణ్యం సంపాదించి రాష్ట్రస్థాయి బహుమతులను అందుకున్నారు. హామర్ త్రోలో జాతీయస్థాయి వరకు వెళ్ళారు.

## జిమ్‌లో శిక్షకురాలిగా..

ఎస్తేరు రాణి ఫిట్‌నెస్ వల్ల జిమ్‌లో శిక్షకురాలిగా చేరారు. అంతంత మాత్రం ఆదాయం, గుర్తింపులేని పని అయినప్పటికీ జీవితంలో ఏదో సాధించాలనే తపనతో లక్ష్యసాధనవైపు కు అడుగులు వేశారు. ఒకరోజు రాత్రిపూట ఇంటికి వెళుతుంటే కొందరు ఆకతాయి యువకులు ఎస్తేరు చేయి పట్టుకుని లాగి అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సంఘటన ఈమె మనసును కలచి వేసింది. మరునాడే తన జుట్టును కత్తిరించి పురుషుల తలకట్టులా మార్చుకుని బాడీ బిల్డింగ్స్‌పై దృష్టి సాధించారు. జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుండి ఒక్కరు కూడా లేరు అనే విషయాన్ని ఎస్తేరు గమనించారు. ఈ రంగంలో నేను ఎందుకు రాణించకూడదు అనే మెరుపు లాంటి ఆలోచన ఆమె మనసులో వచ్చింది.

**అడుగడుగునా ఆటంకాలే:** మహిళా బాడీ బిల్డర్ కావాలంటే వ్యక్తిగత శిక్షకుడు కావాలి. అందుకు వేలల్లోనే ఫీజును చెల్లించవలసి ఉంటుంది. దాంతో పాటు నిర్దిష్టమైన డైట్ తీసుకోవాలి. రోజుకు కనీసం ఏడు గంటల పైబడి కృషి చేయాలి. ఆర్థిక సమస్యలు సుడిగుండంలా చుట్టు ముట్టినప్పటికీ ఎస్తేరు ధైర్యంగా ముందుకు సాగారు. అప్పుచేసి మరీ బాడీ బిల్డింగ్ రంగంలో తీవ్రస్థాయి కృషి చేస్తూ కండలు పెంచారు. 2019లో ఇంటర్ పూర్తి చేసిన పిదప ఇల్లు విడిచి హైదరాబాదు చేరారు. జీవనోపాధి కోసం అక్కడ సూపర్ మార్కెట్లో పనిచేస్తూ బాడీ బిల్డింగ్ సాధన చేశారు. బాడీ బిల్డింగ్ చేయడమంటే సాధారణ విషయం కాదు. ప్రతిరోజు గంటల కొద్ది సాధన చేయాలి. ఖరీదైన ఆహారం తినాలి. అందునా ఏ సహాయం అందని ఒక యువతి ఇవన్నీ చేయడమంటే ఎన్ని రకాల కష్టాలు ఉంటాయనేది చెప్పనవసరం లేదు. 2024 సెప్టెంబర్లో వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ (డబ్ల్యు ఎఫ్.ఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన నేషనల్స్ బాడీబిల్డింగ్ పోటీల్లో ఎస్తేరు రాణి పాల్గొని స్పోర్ట్స్ మోడల్ కేటగిరిలో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాన్ని అందుకున్నారు. ఇదే ఏడాది నవంబర్ 9, 10 తేదీల్లో డబ్ల్యు ఎఫ్. ఎఫ్ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన 'మిస్టర్ అండ్ మిస్ హిందూస్థాన్ బాడీబిల్డింగ్ ఫిటెనెస్ ఛాంపియన్షిప్ అండ్ విమెన్' పోటీల్లో ఏకంగా 'మిస్ ఇండియా'గా బంగారు

పతకం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. తాజాగా యునైటెడ్ ఇంటర్ కాంటినెంటల్ బాడీ బిల్డింగ్ అండ్ ఫిట్నెస్ ఫెడరేషన్ (యూబిబీఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్‌లో 2024 నవంబర్ 22,23 తేదీలలో జరిగిన మిస్టర్ అండ్ మిస్ వరల్డ్ 2024 పోటీలలో శరీరసౌష్టవ విభాగంలో ఎస్తేరు రాణి నాలుగోస్థానంలో నిలిచి పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు తొలి అయిదు స్థానాల్లో నిలిచిన విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు.

అవమానాలను దిగమింగుకుని దళిత యువతి ఎస్తేరు రాణి కండల కన్నీటి కథ వింటే బాధ కలగక




మానదు.

జారుదానిలా ఒళ్ళు చూపిస్తుంది, మగరాయుడిలా తిరుగుతుంది ఇలాంటి అవమానకరమైన మాటలతో బంధువులేకాదు, రాబందుల్లాంటి అనేకమంది ఎస్తేరు రాణిని కించపరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అసలే ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న ఈ రంగంలోకి ఎందుకు వచ్చానురా దేవుడా? అని మదనపడిన సందర్భాలు కోకొల్లలు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా అదుకుంటే ప్రపంచస్థాయి బాడీబిల్డర్ తెలుగువారికి మంచిపేరు తస్తానని ఆత్మవిశ్వాసంతో ఎస్తేరు తెలిపారు. అలానే ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే తట్టుకోవడం కష్టం. ఇప్పటికే పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాను, ఆర్థికంగా అదుకునే వారు లేకపోతే బాడీ బిల్డింగ్‌కు స్వస్తి పలికుతానని ఎస్తేరు రాణి ఆవేదనగా చెప్పారు. ●

# మట్టివాసన అత్తర్



రకరకాల పెర్ఫ్యూమ్స్ వాడుతుంటాం కదా! తొలకరి జల్లులు పడినప్పుడు వచ్చే సువాసనను పోలిన అత్తర్ గురించి విన్నారా..!. అలాంటి అత్తరును మనదేశంలోని పెర్ఫ్యూమ్స్ రాజధానిగా పిలిచే ఉత్తరప్రదేశ్ కన్నౌజ్ ప్రాంతం తయారు చేస్తుంది. నిజానికి ఈ మట్టివాసనను 'పెట్టికోర్' అంటారు. అయితే కన్నౌజ్ ప్రాంతంలో దీన్నే "మిట్టి అత్తర్" పేరుతో ఈ పెర్ఫ్యూమ్స్ తయారు చేస్తున్నారు.

దీన్ని పురాతన భారతీయ సాంప్రదాయ పద్ధతిలో చేస్తున్నారు. చెప్పాలంటే ఇది అత్యంత శ్రమ, సమయంతో కూడిన పద్ధతి. అందుకోసం వాళ్ళు ఎలాంటి కెమికల్స్ వంటి వాటిని ఉపయోగించరు. మరీ వర్షం కురిసినప్పుడు వచ్చే నేల వాసనను పోలిన అత్తరు తయారికీ

ఏం ఉపయోగిస్తారంటే..

దీన్ని పురాత భారతీయ సాంప్రదాయ పద్ధతిలో చేస్తున్నారు. చెప్పాలంటే ఇది అత్యంత శ్రమ, సమయంతో కూడిన పద్ధతి. అందుకోసం వాళ్ల ఎలాంటి కెమికల్స్ వంటి వాటిని ఉపయోగించరు. మరీ వర్షం కురిసినప్పుడు వచ్చే నేల వాసనను

పోలిన అత్తరు తయారీకి ఏం ఉపయోగిస్తారంటే...గంగానది ఒడ్డున ఉండే మట్టిని, గులాబీ రేకులు లేదా మల్లెపువ్వులతో ఈ అత్తరుని తయారు చేస్తారు. తయారీ విధానానికి ఉపయోగించే పాత్రలు సింధులోయ నాగరికత టైంలో ఉపయోగించినవి. ఈ అత్తరు తయారీ విధానం దాదాపు ఐదువేల ఏళ్ల నాటిది. కానీ ఇప్పటికీ అదే పద్ధతిలోనే అత్తరు తయారు చేయడం కన్నౌజ్ ప్రాంతవాసుల ప్రత్యేకత. అంతేగాదు తయారీ మొత్తం పర్యావరణ హితంగానే చేస్తారు.

కనీసం




ప్రాసెసింగ్ పద్ధతుల్లో కూడా కేవలం కట్టెల పొయ్యలతో మండిస్తారు. ఇక ప్యాకింగ్ వద్దకు వస్తే చిన్న లెదర్ బాటిల్ రూపంలో ఈ అత్తర్లను మార్కెట్లోకి తీసుకువస్తారు. అయితే ప్రస్తుతం ఈ అత్తరు తయారీ పద్ధతిని సవరించి.. బొగ్గులు, కట్టెల పొయ్యలకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి మరింత అనుకూలమైన పద్ధతుల కోసం అన్వేషిస్తున్నట్లు ఫ్రాగ్రాన్స్ అండ్ ఫ్లేవర్ డెవలప్మెంట్ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్‌డీసీ) వారు చెబుతున్నారు. ●



కథ

# స్నానం

రాము, శ్యాము ఒకే ఈడువాళ్లు. ఒకే బడిలో ఒకే తరగతి చదువుతున్నారు. ఈమధ్యన శ్యాము చేతులు, ఒళ్లు ఒకటే గీరుకోవడం రాము గమనించాడు. 'శ్యాము ఈమధ్యన నువ్వు ఒకటే గీరుకోవటం గమనించాను. రోజూ నువ్వు స్నానం చేయటం లేదా?' అని ఒక రోజు రాము, శ్యాముని అడిగాడు.




'ఈమధ్యనే మా నాన్న టి.వి.కొన్నారు టి.వి.. చూడటానికి బాగా అలవాటుపడి, ఆలస్యంగా నిద్రపోయి, ఆలస్యంగా లేచేసరికి బడి టైం అవుతుంది. స్నానం చేయకుండా, ఆదరబాదరగా టిఫెన్ కూడా ప్రశాంతంగా తినకుండా బడికి వస్తున్నాను. అందుకే చీదరగా వుంటుంది. బడి వదిలాక కూడా శుభ్రంగా స్నానం చేయకుండా, గబగబా నీళ్లు గుమ్మరించుకొని, ఇంట్లోకి పరుగెత్తి, టి.వి.కి అతుక్కుపోతున్నాను. అమ్మ, నాన్న ఎంత మొత్తుకున్నా మారలేకపోతున్నాను' అని శ్యాము అసలు విషయం చెప్పాడు.

'మనిషి చనిపోయినప్పుడు, చనిపోయిన శవానికి కూడా స్నానం చేయించి తీసుకువెళతారు. చనిపోయిన వాళ్లకే స్నానం చేయించి, తీసుకువెళుతున్నారంటే, బ్రతికి వున్నవాళ్లకి స్నానం ఎంత అవసరమో నువ్వు ఇప్పుడైనా గ్రహించు. స్నానం చేయకపోతే ఒంటి మురికిపోదు. చర్మరోగాలు వస్తాయి. చీదరపుడుతుంది. ఆ చీదరపోవటానికి అదే పనిగా గోకితే, చర్మం లేచిపోయి, ఒళ్లంతా పుళ్లు అవుతుంది. ఇదంతా అవసరమా? శుభ్రంగా స్నానం చేస్తే, శరీరమంతా శుభ్రమై, ప్రాణమంతా హాయిగా వుండి, బడిలో చురుగ్గా వుంటాం. చెప్పిన పాఠాలు చెవులకి ఎక్కి, మెదడుకి చేరి, చదువు బాగా ఒంటపడుతుంది. టి.వి. చూడొద్దు అనను, దేనికైనా పరిమితి వుండాలి. ఏదైనా శృతిమించితే అనేక అనర్థాలు వస్తాయి. టి.వి.కొద్దిసేపే చూడు. వేళకు తిని, వేళకు పడుకో అప్పుడే చక్కగా ఆరోగ్యంగా వుంటావు' అని హితబోధ చేసాడు రాము.

'స్నానం ప్రాముఖ్యత గురించి చాలా చక్కగా చెప్పావు. నాకు బుద్ధొచ్చింది. నువ్వు చెప్పినట్లే నడుచుకుంటాను' మాట ఇచ్చాడు శ్యాము. శ్యాము మారినందుకు రాము చాలా సంతోషించాడు. ఆరోజు నుంచి శ్యాము తన తీరు మార్చుకొని, టి.వి. కొద్దిసేపే చూసి, వేళకు తిని, వేళకు పడుకొని, చదువు మీద బాగ దృష్టిపెట్టి, బాగా చదువుకుంటూ, అమ్మ, నాన్న మెప్పుపొంది, రాము ప్రశంసలు కూడా బాగా పొందాడు.

**– మా.శ్రీ.రాజు**

## చుక్కలు కలపండి



వార్త ఆదివారం

## బాలగేయం

### సముద్రం



సముద్రం సముద్రం
అందాలొలికే సముద్రం
ఉప్పునీటి సముద్రం
అలల హొయి సముద్రం
స్వచ్ఛమైన సముద్రం
చూడాలనిపించే
సముద్రం
రాకాసి అలల సముద్రం
భయము గొలిపే
సముద్రం
భూమిపైన సముద్రం
అధికభాగం సముద్రం
చంద్రుని వల్ల సముద్రం
ఆటుపోట్ల సముద్రం
చేపలు దొరికే సముద్రం
ముత్యాలుండె సముద్రం
ఉప్పునిచ్చే సముద్రం
ఆదాయమిచ్చే సముద్రం
సుందరమైన సముద్రం
జీవరాశి నిలయ
సముద్రం
ఒడలు తిరిగే సముద్రం
వ్యాపార కేంద్రం
సముద్రం
నదులు కలిసే సముద్రం
ప్రశాంతమైన సముద్రం
తుఫాన్లనిచ్చే సముద్రం
సునామి వచ్చే సముద్రం

**- ఆవుల చక్రపాణి యాదవ్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె. రజత్,** నాందేడ్

**ప్రశ్న: డిజిటల్ కెమెరాలలో ఫిల్మ్ అవసరం ఎందుకు ఉండదు?**



**జవాబు: రజత్!** ప్రస్తుత డిజిటల్ కెమెరాలలో ఫిల్మ్ ఉండే స్థానంలో ఛార్జ్ కపుల్డ్ డివైసెస్ ఉంటాయి. సిసిడిలో ఫొటో డయోడ్‌లు, షిఫ్ట్ గేట్‌లు, సాలిడ్ స్టేట్ కెపాసిటర్లు అనే 3 విభాగాలు ఉంటాయి. కెమెరా లెన్స్ గుండా వచ్చిన కాంతికిరణం సిసిడిలోని ఫొటో డయోడ్ మీద ప్రసరించగానే విద్యుత్ ప్రవహిస్తుంది. 'షిఫ్ట్ గేట్' స్విచ్ మాదిరిగా పని చేస్తుంది. దీని ద్వారా ప్రవహించిన విద్యుత్ సిసిడిలోని సాలిడ్ స్టేట్ కెపాసిటర్‌లోకి వచ్చి, అందులో నిల్వ ఉంటుంది. సిసిడిలో వుండే ఎనలోగ్ షిఫ్ట్ రిజిస్టర్‌లు, కెపాసిటర్‌ల నుంచి వచ్చిన విద్యుత్ చార్జీలను సరైన పద్ధతిలో ఉంచుతాయి. సిసిడి యూనిట్‌లు ఒక సెల్ నుంచి, మరో సెల్‌కు ఓల్టేజీని ఏమాత్రం నష్టం లేకుండా బదిలీ చేయగల వు. సిసిడి చిప్‌లో మెటల్ ఆక్సైడ్, సెమీ కండక్టర్ కెపాసిటర్‌లు (ఎమ్ఓఎస్ కెపాసిటర్‌లు) అనేకం ఉంటాయి. ప్రతి కెపాసిటర్ ఒక్కొక్క పిక్సెల్ (పిక్చర్ ఎలిమెంట్–బొమ్మ/ఛాయా చిత్రం మూలాలు)గా పనిచేస్తుంది. సిసిడి చిప్ కెమెరాలను బ్యాక్ ఇల్యూమినేటెడ్ కెమెరాలని కూడా అంటారు.

**- కె. కాత్యాయని,** సూళ్లూరుపేట

**ప్రశ్న: విమానాల విషయంలో మనదేశం ప్రతిభ ఏమైనా ఉందా?**

**జవాబు: కాత్యాయని!** అది ప్రపంచ స్థాయిలో ప్రథమమైనది. ఉత్తరాలను విమానం ద్వారా చేరవేసే పద్ధతిని ప్రపంచంలోనే మొదటిసారిగా మన దేశంలో ప్రవేశపెట్టారు. 1911లో హెన్రీ పిక్వెట్ హంబర్ విమానంలో 6,500ల ఉత్తరాలను అలహాబాద్ నుంచి నైనిటాల్ జంక్షన్‌కు చేరవేశాడు. టాటా కూడా తమ తొలి విమాన సర్వీస్‌లో తపాలాను కూడా తీసుకెళ్లారు. 1920లో ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ బొంబాయి నుంచి కరాచీకి ఎయిర్ మెయిల్ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది.

# ప్రాణరక్షణకు హెల్మెట్

ఆనంద 'మైత్రేయ'మ్

**రోడ్డు ప్రమాదంలో కింది పడినప్పుడు తలకు దెబ్బ తగలడం సాధారణం. 75 శాతం కేసుల్లో ఇదే జరుగుతోంది. ఒక్కసారి తలకుబలమైన గాయం అయితే కోలుకోవడం చాలా కష్టమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కోలుకున్నా సరే, ఆ గాయం జీవితాంతం వెంటాడుతునే ఉంటుందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ ధారణ అనివార్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.**



తల నేలకు తాకినప్పుడు బలమైన గాయం కాకుండా కాపాడుతుంది హెల్మెట్. గాయమైన తీవ్రత తక్కువగా ఉంటుంది. సరైన హెల్మెట్ ధరించడం ద్వారా తలకి రక్షణ కల్పించవచ్చు. హెల్మెట్ పెట్టుకుని ద్విచక్ర వాహనం నడపడం చాలామందికి నచ్చదు. జుట్టు చెరిగిపోతుందనో, తలకు ఉక్క పోస్తుందనో, వెంట్రుకలు పొడవు రాయనో, ఆదో శిరోభారం అనుకునే హెల్మెట్ ధారణకు 'నో' చెప్పేస్తుంటారు. ఇది మంచి ఆలోచన కాదు. శరీరంలోని అన్ని అవయవాలకంటే కూడా తలకు విశిష్టమైన స్థానం ఉన్న సంగతి మనందరికీ తెలిసిందే.

తలలో భద్రంగా ఉండే మెదడు అన్ని శరీర భాగాల చేత పని చేయిస్తుంది. శరీర సమతుల్యతను కాపాడుతుంది. ప్రమాదం జరిగినప్పుడు మెదడుకు దెబ్బ తగిలితే, తగిలిన చోట ఉన్న మెదడు కణాలు (న్యూరాన్లు) నశిస్తాయి. దాని వల్ల శరీరంలో మిగిలిన భాగాలకు కూడా ఎఫెక్ట్ అవుతుంది. అందుకే హెల్మెట్ వాడకం వల్ల లాభాలే ఎక్కువ. శరీరంలో ఉన్న మిగతా కణాలకు, న్యూరాన్లకు స్వల్పమైన తేడా ఉంది. శరీరంలో నశించిన న్యూరాన్ల స్థానంలో కొత్తవి తయారు కావు, కానీ కణాలు మాత్రం కొత్తవి తయారవుతాయి.

న్యూరాన్లు నశించటంతో అప్పటివరకూ ఆజమాయిషీ చేస్తోన్న అవయవాల పనితీరు దెబ్బతింటుంది. దెబ్బ తీవ్రతను బట్టి కొన్ని అవయవాలు శాశ్వతంగా చచ్చు బడటం, జ్ఞాపకశక్తిని కోల్పోవటం లాంటివి జరుగుతుంటాయి. కాబట్టి తలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి టూవీలర్స్‌ను నడిపేవాడు హెల్మెటీ చరిస్తాడు, ఈ హెల్మెట్ వాడకం పట్ల ప్రమాదాలు జరిగినప్పుడు తలకు అయ్యే గాయాల తీవ్రతను తగ్గిస్తుంది.



మెదడుకు తగిలి గాయాలనుండి కాకుండా. సర్వైకల్ స్పైన్ గాయాలనుండి హెల్మెట్ రక్షిస్తుంది. హెల్మెట్లను వినియోగించి సురక్షిత ప్రయాణం చేయాలనే పోలీసులు పదేపదే చెబుతున్నా వాహనదారులు చెవికి ఎక్కడంలేదు. కొంతమంది యువకులు పరిమితికిమించి వేగంతో, త్రిలోకంలో భూతలస్వర్గంలా నడుపుతున్నారు. మితిమీరిన వేగంతో అదుపుతప్పి, ఎదురుగావచ్చే వాహనాలను ఢీకొట్టి, ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు మనం ఎన్నో చూస్తున్నాం. 1953లో పేటెంట్ హక్కులు పొందిన లోక టార్డ్ హెల్మెట్‌ని ఎన్నో విధాలుగా డిజైన్లు మార్చి ప్రపంచానికి అందించారు. యుద్ధాలలో సైనికులు రాజులు తలకు రక్షణగా హెల్మెట్‌ను ధరించేవారు. అనేక రకాల లోహాలతోనూ, పైసీతోనూ తయారుచేసేవారని కొంతమంది రాజులు బంగారముతోనూ తయారైనవి ధరించేవారని ప్రస్తావన ఉంది.

"ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' దెబ్బ తగిలాక బాధపడేకన్నా తగలకుండా చూడటం మిన్న. అందుకు మనం చేయాల్సింది హెల్మెట్ పెట్టుకోవడం. పోలీసులు పట్టుకోవడం లేదని కొందరు, జుట్టు చెదిరిపోతుందని మరికొందరు, ఉక్కపోస్తుందని ఇంకొందరు హెల్మెట్ పెట్టుకోవడంతో నిర్లక్ష్యం చూపుతుంటారు. అసలు హెల్మెట్ పెట్టుకోవాల్సింది పోలీసుల కోసం కాదు మన ప్రాణరక్షణ కోసం అన్నది మరచిపోకూడదు. వాహనాల ప్రమాదాల్లో దేశంలో ప్రతి నాలుగైదు నిమిషాలకు ఒకరు తలకు గాయాలై చనిపోతున్నారు. రైడింగ్ చేసే వారిలో 25 శాతం మంది హెల్మెట్ ధరించడంలేదు. ట్రెక్ రైడర్స్ హెల్మెట్ ధరించేవాడు 5 శాతమే. హెల్మెట్ సక్రమంగా ధరించక పోవడం వల్ల 15 శాతం మంది గాయపడుతున్నారు. సక్రమంగా ధరించడం వల్ల బయటపడుతున్న వాడు 5 శాతం. జిల్లాలో వాహనాల సంఖ్య లక్షల్లో ఉంటే ద్విచక్ర వాహనాలు 80 శాతం. రోడ్డు ప్రమాదంలో 75 శాతం తలకు గాయాలతో చనిపోతున్న వారి సంఖ్యనే అధికంగా ఉంటుంది. ఎవరైనా వాహనం నడిపేముందు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని నడపాలి, వారిపై ఎంతమంది ఆధారపడి ఉంటారో ఆలోచిం చుకోవాలి. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ సీటు బెల్టులను విధిగా వాడాలి ప్రతి ఒక్కరూ విధిగా రూల్స్‌ను పాటించి సహకరించాలి.

పోలీసుల సూచనలు పాటించి. రోడ్డు ప్రమాణాల్లో ద్విచక్రవాహ నదారులు ఎక్కువగా తలకు తీవ్రగాయాలై మరణిస్తున్న విష యం తెలిసిందే. ఈవిషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రతి ఒక్కరూ హెల్కెట్‌ను వినియోగించాలని ఆదేశించింది. పాత నిబంధనలను మళ్లీ వెనక్కి తీసుకొచ్చింది. పోలీసుశాఖ కఠినంగా వ్యవహరించి హెల్మెట్లు తప్పనిసరిగా ధరించే చైతన్య ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిం చింది. దీంతో 50 శాతం మంది వాహనదారులు హెల్మెట్లను కొనుగోలు చేశారు. మిగిలిన 50 శాతం మంది కూడా హెల్మెట్లను వినియోగించడం తప్పనిసరని ప్రభుత్వం హెచ్చరించింది.



### ధరించకపోతే నష్టపోయేది జనమే

హెల్మెట్ పెట్టుకోకపోత ఏమవుతుంది? ఎందుకు పోలీసులు ఇబ్బడి ముబ్బడిగా కేసులు నమోదు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. వేసవిలో అంటే ఉక్కపోతలో ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలంలోనూ ఎందుకు ధరించడం లేదని ఇక్కడ ప్రశ్న తలెత్తుతోంది. ద్విచక్ర వాహనాదారులకు శిరస్త్రాణం తప్పనిసరి చేయడంతో పాటు, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ప్రతి రోజు ఏదో ఒకచోట హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి పోలీసులు ఫైన్ వేస్తున్నారు. ప్రతిరోజు కొంతమంది హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కుతున్నారు. కొంతమేర వాహనాదారుల్లో మార్పు కనిపిస్తున్నా ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని అధికారులు అంటున్నారు.

### లోపలి భాగాలకు రక్షణ

సాధారణంగా తలకు గాయమైనప్పుడు కొద్ది సెకన్ల పాటు స్పృహ కోల్పోవడం, తలనొప్పి, అయోమయం, తల తేలికగా ఉన్నట్టు అనిపించడం, దృష్టి మసకబారడం చెవిలో హోరున శబ్దం, రుచి తెలియకపోవడం, బాగా అలసటగా ఉన్నట్టు అనిపించడం, ప్రవర్తనలో మార్పులు, జ్ఞాపకశక్తి, దృష్టి కేంద్రీకరించడంలో మార్పుల వంటివి కనిపిస్తుంటాయి. తీవ్రమైన గాయాలైతే తలనొప్పి తగ్గకుండా వేధించడం మాటిమాటికి వాంతులు, వికారం, మాట ముద్దగా రావడం అవయవంలో బలహీనత లేదంటే తిమ్మిర్లు, కాళ్లూ చేతులకు సమన్వయం లోపించడం, తీవ్రమైన అయోమయం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. హెల్మెట్ ధరించడం వల్ల జుట్టు ఊడిపోతుందనేది కేవలం అపోహ మాత్రమేనని వైద్యులు చెబుతున్నారు.

హెల్మెట్ ధారణ, సీటు బెల్టు పెట్టుకోవడం ఒక అలవాటుగా మారాలి. చాలామంది చిన్నచిన్న అజాగ్రత్తల కారణంగా ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించినా గడ్డం కింద బెల్టు పెట్టుకోరు. దీనివల్ల పెట్టుకున్నా లేనట్లే లెక్క. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారు హెల్మెట్ ధరించినా మితిమీరిన వేగంతో వెళ్లడం సరికాదు. ఎవరైనా ద్విచక్రవాహనం, కారు ఎక్కి ముందు, నడిపేముందు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని నడపాలి. వారిపై ఎంతమంది ఆధారపడి ఉంటారో ఆలోచించుకోవాలి. ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి సహకరించాలి.. పోలీసుల సూచనలు పాటించి, సహకరించాలి.

చాలామంది అయిష్టంగానే హెల్మెట్లు ధరిస్తుంటారు. హెల్మెట్ కారణంగా జుట్టు రాలీ బట్టతల వస్తుందనే భయం. అందరిలో కాకుండా కొద్దిమందిలో మాత్రమే ఉందని అంటున్నారు నిపు ణులు. సాధారణంగా హెల్మెట్ ధరించడం వలన శిరస్సుకు ఆక్సిజన్ అందక జుట్టు రాలుతుందనేది అపోహ మాత్రమే అని అంటున్నారు. జుట్టు అక్సిజన్ మీద ఆధారపడదని స్పష్టం చేస్తున్నారు. కేవలం రక్తప్రసరణ ద్వారా జుట్టుకు ఆక్సిజన్ అందుతుంది. గట్టిగా దిగబిడిసినట్టు ఉండే హెల్మెట్ల ఉన్నా వదులుగా ఉండే హెల్మెట్లను వాడటం శ్రేయస్కరం. బిగదీసినట్టుగా ఉండే హెల్మెట్లు జుట్టు అంచుల వరకు వెళ్లి రక్తప్రసరణను నిలిపివేస్తాయి. హెల్మెట్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి. లేదంటే అందులో దుమ్ము దూళి చేరి స్కల్స్‌కి ఇన్ఫెక్షన్ సోకుతుంది. దాంతో జుట్టు రాలే అవకాశముంది. అందువల్ల నాలుగు రోజులకు ఒకసారైనా హెల్మెట్‌ను శుభ్రం చేసి ఎండలో బాగా ఆరనివ్వాలి. అలాగే దూరం ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు గంటకు ఒకసారైనా హెల్మెంట్‌ను తీసి తలకు గాలి తగలనివ్వాలి. ఎక్కువ సేపు హెల్మెట్ పెట్టుకోవడం వలన తల తిరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. ఎవరైనా ఐఎస్ఐ గుర్తింపు లేని హెల్మెట్లు అమ్మితే అది నేరమే. నాన్‌ఐఎసిఐ హెల్మెట్లు చౌకగా లభిస్తున్నాయని కొనడం ప్రమాదాలకే దారితీస్తుంది. అది ఐఎస్ఐఐ మార్క్డ్ హెల్మెట్ కొనాలంటే నాణ్యతను బట్టి ఖర్చు చేయాల్సింది. ప్రస్తుతం 1.5 కిలోలుగా ఉన్న హెల్మెట్ బరువు కొత్త ప్రమాణాల ప్రకారం గరిష్టంగా 1.2 కిలోలు మాత్రమే ఉండాలి. ఐఎస్ఐ 4151:2015 సర్టిపికేషన్ ఉన్న హెల్మెట్లనే అనుమతిస్తాడు. కొందరు వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యత లేనివి విక్రయిస్తున్నారు.

ఇటువంటివి పెద్దగా దెబ్బ తగిలితే పగిలిపోయి తలకు తీవ్ర గాయమయ్యే వీలుంటుంది. కొందరు సగం వరకు ఉండి హెల్మెట్ ధరిస్తుంటారు. దీనివల్ల ప్రయోజనం ఉండదు, గడ్డం, దవడలు, పళ్లు తదితర భాగాలకు సమగ్ర రక్షణ ఉండాలంటే ఐఎస్ఐఐ మార్కు ఉన్న పూర్తిస్థాయి హెల్మెట్లను మాత్రం ధరించాలి.



ప్రస్తుతం మార్కెట్లో రూ.500 నుంచి రూ.1500 వరకు ధరలలో హెల్మెట్లను అమ్ముతున్నారు. వీటిలో ఐఎస్ఐఐ మార్కు ఉండే హెల్మెట్లను మాత్రమే కొనుగోలు చేయాలని పోలీసు, రవాణా శాఖల అధికారులు సూచిస్తున్నారు. ●

అనువాదకథ

# అనగనగా ఓ తల్లి

ఎన్.యాన్(ష్వేలి), మయిన్మార్
ఆంగ్లం: మ ధనేగి
తెలుగు: టి.లలితప్రసాద్

**"హైయు**
**ఈ, నువ్వింకా నదిలోనే వున్నావా? త్వరగా రా, వర్షం ముంచెత్తేలా వుంది, బట్టలు ఇంకా ఆరలేదు.."**

**ఆరేసిన బట్టలు తీసేస్తూ మా అమ్మాయిని పిలుస్తూనే వున్నాను. నదిలో కొట్టుకువచ్చే కొయ్యలు ఏరడంలో అది ఇంకా అక్కడే ఈదులాడుతోంది. అలా ఎక్కువ సమయం వుండొద్దనీ, జలుబు చేస్తుందని చెప్పి చెప్పి విసుగొచ్చింది. నదిపోటు బాగా వున్నప్పుడు కూడా అలానే వెళుతుంది, ఆమెకు సరిగా ఈతే రాదు. కానీ ఆమె మాత్రం ష్వేలీ నదిలో ఒడ్డుదగ్గర అలా వుంది.**

అడవికెళ్లి కట్టెలు కొట్టుకొచ్చేకంటే ఇలా కట్టెలు, దుంగలు పట్టడం నయం గదా! అందుకే గట్టిగా కూతుర్ని ఆమె ఏమీ అనలేదు. అయితే ఆమె ఒక్కతే లేదు, నగ్రామంలో కొందరు మగవాళ్లూ నదిలోకి వెళ్లారు.

నేను ఇంటికి వెళుతుండగా ఎవరో "టిన్ చో.. ఓ టిన్ చో, నీ కూతురు కొంచెం వుంటే మునిగి పోయేదే! ఎవరో వెంటనే వెళ్లి నీళ్లలోంచి పైకి లాగారు, లేకపోతే అది ఈ పూట నీకు దక్కేది కాదు!" అని అరిచారు.



ఒక్కసారి మళ్లీ వెనక్కి పరుగుపెట్టాను. ఎంత కంగారుపడ్డానో!

గుండె వేగంగా కొట్టుకుంది, ఆ మాట వినగానే ప్రాణం పోయినంత పనయింది. లబో దిబోమని గుండెలు కొట్టుకుంటూ పరుగుదీశాను. అప్పటికే ఇద్దరు ఆడవాళ్లు మా అమ్మాయిని జనంలోంచి మోసుకొచ్చారు. వారి వెంట జనం. అమ్మాయి జుత్తు నీటి కింద కొమ్ములకు ఎలా చిక్కుకుందీ, అప్పటికే ఈదురుగాలులు వీచి, భారీ వర్షం మొదలై అమ్మాయి తలకిందులై లోపలికి జారిపోవడం.. కథలు కథలుగా అనుకుంటున్నారు అంతా. అప్పటికే దగ్గరలో పడవలో వున్న వాడెవడో ఒక్క వుదుటున నీళ్లలోకి దూకి తన స్నేహితుల సాయంతో బయటికి తెచ్చాడట.

భగవంతుడా! ఇవాళ వాళ్లు లేకపోతే బిడ్డ ఏమయ్యేదో! అందరికీ మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టాను. అందరికీ టీ చేసి ఇచ్చాను. అమ్మాయిని రక్షించిన వారిని అప్పుడప్పుడూ ఇంటికి వస్తూండమని ఆహ్వానించాను. వాళ్లు నా పిల్లని రక్షించారు. అందుకు వారికి నేనేమి సాయం చేయాలి? నా ఇంటి ముందు పెట్టుకున్న పచారీ దుకాణంలో సామాన్లు తీసుకోమని చెప్పాలి. చూడ్డానికి నల్లగా, దొంగల్లా చూడ్డానికే చిరాగ్గా వున్నారు. కానీ ఎంతో బాగా మాట్లాడారు. మాండలే నుంచి వచ్చినప్పటి నుంచి కాలంతో పాటు ఎంతో మారారనే అనాలి. మా అమ్మాయిని రక్షించడానికి నీళ్లలోకి దూకిన కుర్రాడి పేరు ఆంగ్ సో ఖయింగ్. ఎంత మంచి పేరో!

నేను ధైర్యంగా వుంటాను. వాళ్లు మా అమ్మాయి పట్టిన కట్టెలు, దుంగ మా యింటిదాకా లాక్కుని వచ్చారు. వాళ్లు నన్ను ఆంటీ అని, మా అమ్మాయిని చెల్లీ అని పిలుస్తుంటారు. అచ్చం టౌనువాళ్లలా, ఇపుడు వాళ్లంతా మా నగ్రామ అతిథులు కనుక వాళ్లనేమీ అనలేను, అనకూడదు కూడా.

వాళ్లవాళ్లకు దూరంగా ఉంటున్నారు. తినడం, నిద్ర అన్నీ పడవల మీదనే. ఒక్కోసారి వాళ్లకి పెద్ద పెద్ద దుంగలు పెద్ద సంఖ్యలో దొరుకుతుంటాయి. అలాంటపుడు మోటారు బోటు మాట్లాడుకుని నదిలోకి వెళతారు. వాటిని మాండలేకి తీసుకెళ్లి అమ్మి కొంత డబ్బు తెచ్చి, రెండు మూడు రోజులు విశ్రాంతి తీసుకుంటుంటారు.

నమ్మశక్యంగా వుందా? తల మీద పాము కాటులా వుంది నాకు. మా అమ్మాయి, దాన్ని కాపాడిన అంగ్ ఖయింగ్ ప్రేమలో పడ్డారని చూచాయగా విన్నా. నది ఒడ్డున ఇద్దరు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూండడం ఇక్కడ చాలామంది గమనించారు.

అది తెలిసి పిల్లని నిలదీశాను. కానీ ఆమె నిరాకరించింది. తనని నమ్మమంది. గదిలో ఓ మూల పడి ఏడుస్తూండిపోయింది.

"బుద్ధిలేనిదానా, నిప్పులేనిదే పొగ ఎలా వస్తుంది? ఇక వేరే అబ్బాయిలే లేరా? వాడికి చిక్కావు? నువ్వింకా చిన్నపిల్లవని నేను, మీ నాన్న అనుకుంటున్నాం. నువ్వేమో ఒక మొగాడినే వెతుక్కున్నావ్!"

నాకు వెర్రి కోపం వచ్చింది. పిల్లదాన్ని కొట్టాను. నా కోపానికి ఆశ్చర్యపోయింది. ఏడ్చింది, కాళ్ల పట్టుకుంది, ఎంతో ఏడ్చింది. ఏ తల్లయినా తన పిల్లల్ని కొట్టాలని అనుకోదు. కానీ నేను కొట్టాల్సి వచ్చింది. నేను ఏమాత్రం ఆలోచించలేదు. చాలాసార్లు అది అద్దం ముందు గడపడం, తన అందం చూసి మురిసిపోతుండడం గమనించాను. ఏదో పిచ్చిదిలే అనుకున్నాను. నిజం.. అది ఇలా చేస్తుందని ఎన్నడూ వూహించలేదు. పిల్లలంతా మారిపోతున్నారు.

వాడు ఆ వెధవ మా అమ్మాయిని వలలో వేసుకున్నాడు. వాడి మిడిగుడ్లవాడూ.. అంత మంచి పేరు వాడికి వుండటమే దురదృష్టం. వాడు వాడి స్నేహితులంటే ఎంతో గౌరవించాను. ఇలాంటివాళ్ల పరిచయం కావడం మంచిదేననుకున్నాను. ఇంటికి వస్తూండడానికి అనుమతించాను. సరదాగానే మాట్లాడేవాడు. ఇంటి ముందు చెట్ల నీడల్లో నిలబడి చక్కగా మాట్లాడుకునేవారు. అసలు మా అమ్మాయి ఎనిమిది తప్పకుండా వుంటే వాడికంటే చదువులోనూ ముందుండేది. అప్పటికీ మా ఆయన హెచ్చరించాడు. "మనింట్లో పిల్లీడు పిల్ల వుంది, ఇలా కుర్రాళ్లని ఇళ్లలోకి రానిస్తే ఎలా?" అని. నేనే పిచ్చిదాన్ని, వినలేదు. నేను దేన్నీ మరోసారి ఆలోచించని అంటుంటాడు మా ఆయన. అది నిజమే.

వాడు మా అమ్మాయి ప్రాణాలు కాపాడాడు. అందుకు వాడికి రుణపడి వుండాలి. వాడిని, వాడి స్నేహితుల్ని ఆత్మీయులుగా చూసుకోవాలనుకున్నాను. అలాగని మా అమ్మాయిని వాడికిచ్చి పెళ్లి ఎలా చేయను? ఇదంతా జరుగుతుందని ఏమాత్రం తెలిసినా పది అడుగుల దూరం వుంచేదాన్ని. వాళ్లు మారారు. వాళ్లు మారితే మరి నేను మారకూడదా? నాకు ఆ హక్కు వుంది. వాళ్లని ఇంటికి పిలవడం అటుంచి వాళ్లని చూస్తే వొళ్లు మండుతోంది. దుకాణానికి వచ్చినా, వాళ్లకి కావలసినవి ఏవీ లేవని చెబుతున్నాను. అమ్మాయిని డేగకళ్లతో గమనిస్తున్నాను. దుకాణంలో అసలు కూచోనీయడం లేదు. బయటికి తిరగడానికి పంపడం లేదు. ఏదయినా పనిబడినా నేనే వెళుతున్నాను. నా పరిస్థితికి నాకే ఆశ్చర్యమేస్తోంది.

అమ్మాయి గదిలో మూలగా కూచుని ఏదో పుస్తకం తీసి చదువుతూ సమయం గడుపుతోంది. ఆ కథలు, నవలలూ అలాంటి ప్రేమ కథలవే. అయినా రచయితలు మరీ ఇంత బాధ్యతా రాహిత్యంతో వుంటే ఎలా? తల్లిదండ్రులంటే వారికి పట్టదా? నిప్పు మీద వున్న పిల్లిలా వున్న నన్ను మా ఆయన చూసి, "నీకు నువ్వే ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నావేమో.. గమనించావా? శాంతించు. నిన్ను చూస్తుంటే నాకే తల తిరుగుతోంది!"

"తల తిరుగుతుంటే ఏదయినా మాత్ర వేసుకో. అంతేగానీ నన్ను ప్రశాంతంగా వుండమని అనకు. ఎలా వుంటాను? మీకేం మగాళ్లు. పిల్లల సంగతి పట్టించుకునేది మేమేగదా.

మాకు ఆ దిగులు, భయమూ ఉంటాయి. నువ్వు వుండు మంచులాగా, నాకు చెప్పొద్దు".

అంతే..! మా ఆయన నోరు మూసుకున్నాడు. ఆయన చాలా మంచి వ్యక్తి. కానీ మహా నిదానం. దేన్నీ అంతగా పట్టించుకోడు. కానీ పిల్లల విషయంలో అన్నింటా అలా మౌనంగానో, ప్రశాంతంగానో వుండడం కుదరదు. అప్పటికీ ఆయనకు కోపం వస్తే ప్రమాదమని అమ్మాయినీ హెచ్చరించాను. ట్రక్కులు, మోటారు బోట్లు త్వరగా బాగుపడాలనే కోరుకుంటున్నాను. సహనం కోల్పోతున్నాను. భారీ వర్షాలు రావాలని, అలాగయితేనే అమ్మాయి బయటకి అడుగు పెట్టదనీ కోరుకుంటున్నాను".

ఈ మధ్య ఆ వెధవలు మా ఇంటి ముందుగా వస్తూ పోతూ సినిమాల్లో పాటలు పాడుతూ తిరుగుతున్నారు. అమ్మాయి కాఫీ అనో, మంచినీళ్లనో ఇంట్లోనే తిరుగుతూ వాళ్ల కంటబడుతోంది. అదంతా భరించలేక బయటికి వచ్చి అందర్నీ తిట్టిపోశాను. మా ఆయన విన్నాడు. "ఇతరుల పిల్లల మీద అలా ఎందుకు అరుస్తున్నావ్?" తప్పుగదూ!"

"ఏం ఫరవాలేదు. వాళ్ల పనివల్ల అమ్మాయి ఇల్లు విడిచి వెళ్లకూడదు. అదే కావలసింది. అందుకు ఏదయినా చేస్తాను. దానికింకా పదిహేడేళ్లే. అపుడే అబ్బాయి, ప్రేమా కావాల్సి వచ్చాయా?

మా ఆయన మౌనం వహించాడు.

"అమ్మాయికి పదిహేడేళ్లు వచ్చాయి.

> **"మనింట్లో పిల్లీడు పిల్ల వుంది, ఇలా కుర్రాళ్లని ఇళ్లలోకి రానిస్తే ఎలా?" అని మా ఆయన హెచ్చరించాడు. నేనే పిచ్చిదాన్ని, వినలేదు. నేను దేన్నీ మరోసారి ఆలోచించనని అంటుంటాడు మా ఆయన. అది నిజమే.**


## రచనలకు ఆహ్వానం

*రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:*

*ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,*

*లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.*

*sunmagvaartha@gmail.com*

నువ్వు కొంచెం జాగ్రత్త వహించు. అదేమి చిన్నపిల్ల కాదు" అన్నప్పుడల్లా నేను అంతగా పట్టించుకోలేదు. మొదట తెలీలేదు ఆయన మాటకు ఇలాంటి అర్థం వుంటుందని. నాకు అంతులేని కోపం వచ్చింది. ఆయన్ను అలానే చూశాను. ఆయన విసుక్కుని లోపలికి వెళ్లాడు.

ఆయన అన్న మాటకి ఆ రాత్రంతా నిద్ర పోలేదు. నాలో భయం, అమ్మాయి గురించిన కంగారులో నేనూ పదిహేడేళ్లకే పెళ్లాడిన సంగతే మర్చిపోయాను.

పెళ్లికి ముందు ఇద్దరం దొంగతనంగా చూసుకునేవాళ్లం.. అంతే. మా అమ్మ నన్ను తల్లీ నీకంటే వయసులో పెద్దవాడయిన కో శాస్ యా, మనకంటే డబ్బున్నవాడు అని భయపెట్టింది. కానీ ఒకరోజు రాత్రి ఇంటిబయట ఫెన్సింగ్ దగ్గర చీకట్లో కనిపించాడు. మా తమ్ముడు మంచి నిద్రలో వుండటం గమనించి వెళ్లి అతన్ని కలిసాను. ఇద్దరం లేచిపోదామన్నాడు.

"రాకుంటే నిన్ను చంపుతాను. నేనూ చస్తాను" అని చిన్న కత్తి తీసి చూపాడు. పదిహేడేళ్లకే పెళ్లేంటి? అన్న ఆలోచన వద్దు. తప్పని స్థితిలో నాకు అది తప్పదని అప్పుడు ఆయన బెదిరించడంలో అర్థమయింది. ఇపుడు నా కూతురు విషయంలో నేనూ వెళితే చంపుతాననే బెదిరించాను.

ఇప్పుడు అంతా బాగానే వుంది. మర్నాడు పడవలు మామూలుగానే ప్రయాణమయ్యాయి. భయానక తుఫాను నుంచి బయట పడినందుకు సంతోషంగా ఉంది.

కానీ నా కూతురు మాత్రం ఇంకా దిగులుగానే వుంది. ఏదో తినాలిగదా అని కొంచెం తిని పడుకుంది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు దాని ఆలోచనతో.

రాత్రి చాలాసేపటికి పిల్లదాని గదిలో ఏదో శబ్దం అయింది. నేను అవతలి గదిలో కుండలో నీళ్లకోసం వెళ్లినట్టు వెళ్లి చూశాను. అలా దాన్ని గమనిస్తూ ఎప్పుడో మూడింటికి నిద్రపోయాను. తెల్లారుతుండగా మళ్లీ ఏదో శబ్దమై తటాలున లేచి వెళ్లాను.

"అబ్బా, ఎంత భయపెట్టేవు. బాత్‌రూమ్‌కి వెళ్లాలన్నా భయంగా వుంది" అంది.

కూతురు చేతిలో తల్లి పిచ్చిదయితే చరిత్ర తిరగరాయాలిగదా. ఇద్దరం దీపం పట్టుకుని పెరట్లోకి వెళ్లి వచ్చాం.

"ఇవాళ చేపలు వండుకుందాం. వచ్చి సాయం చేయి. వీలయినంత త్వరగా వంట ముగించి గుడికి వెళ్లాలి".

పిల్లదాన్ని నా చూపులు దాటకుండా నిలువరించగలిగాను. పిల్లది కూడా నా వెంటే వుంది. దానికీ భయమేసింది. మళ్లీ ఎక్కడ కొట్టిచంపుతానా అని. కానీ పరధ్యానంగా వుందన్న విషయం అర్థమవుతోంది. రాచ్చిప్పలో మిరపకాయలు నూరుతోంది. అందుకనే నేనేమీ అనలేదు.

కొందరు మా ఇంటి వెనగ్గా పడవలు లాక్కెళుతున్నారు. సరిగ్గా ఆ సమయానికి అమ్మాయి తన కంట్లో కారం పడిందని నీళ్లతో కడుక్కుంటానని వెనగ్గా వున్న నీళ్లతొట్టి వేపు వెళ్లింది. దోసిట్లోకి నీళ్ల తీసుకుని మొహాన కొట్టుకుంది. నాకు సరిగ్గా కనపడటం లేదని అది ఎవరికో చేయి ఊపుతోంది. నేను తెరచాప పక్కకి నెట్టి మరీ చూశాను. వాడే, ఆ వెధవకేసే అది చేయి వూపుతోంది. పడవతో వెళుతూ వాడూ చేయి వూపుతున్నాడు.



కానీ అలానే అనుకున్నాను. దానివల్ల ప్రమాదమేమీ లేదు. వాళ్లు వేట పూర్తి చేసుకుని వచ్చేసరికి మే మాసం వస్తుంది. ఈ మధ్య కాలం ఎంతో మారుతుంది, మారకపోదు.

కనుక నేను కంగారుపడవలసిన అవసరం లేదు. ఈ ప్రేమలు అంతంత మాత్రమే. గాలిధాటికి ఆరిపోయే నిప్పులాంటిది.

నా పిచ్చితల్లికి ఓ మంచి గుడ్డముక్క కొనాలి, సరిగ్గా అది కోరుకున్నది. అది ఎంత ఖరీదయినా ఫరవాలేదు. కనీసం అలాగయినా దాని మనసు శాంతిస్తుంది. నాకు కావలసింది అదే.

◆

## నవ్వుత్... రువ్వుత్..



విజ్జి: "యావండీ! ఈ మధ్య ఎక్కువ టీ తాగుతున్నారు. నేను చేసే టీ అంత బాగుంటోందా?"

నాని: "అది కాదు విజ్జీ, డాక్టర్ ఎక్కువగా వేడి నీళ్లు తాగమన్నారు".

........

రామారావు: "ఎస్సైగారూ, నన్ను ఎలాగైనా రక్షించండి. నా భార్యని కత్తితో పొడిచాను".

ఎస్సై: "ఆమె చనిపోయిందా?"

రామారావు: "ఆమె చనిపోలేదు సార్, అదేగా నా భయం".

........

అనిల్: "ఏరా ప్రదీప్, విజ్జికి మొబైల్ కొనిచ్చావుగా. మళ్లీ వాపస్ తీసుకుంటున్నావు ఎమైంది?"

ప్రదీప్: "నేను ఎప్పుడు ఫోన్ చేసినా అవుటాఫ్ కవరేజి అనో లేదా మరో లైన్‌లో బిజీ అని వస్తోంది".

........

లిఖిత: "ఏమండీ! ఒకవేళ మీకు భగవంతుడు ప్రత్యక్షమైతే ఏమి అడుగుతారు?"

రామ్: "నా పెళ్లికి ముందు ఎందుకు ప్రత్యక్షమవలేదు అని అడుగుతాను".

........

డాక్టర్: "అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎందుకు ప్రార్థించావు?" అన్నాడు భార్యతో.

భార్య: "అందులో తప్పేముంది? మంచి విషయమేగా!"

డాక్టర్: "నేను డాక్టర్‌నన్న విషయం నువ్వు మరిచిపోయినట్లున్నావు".

........

భర్త: "ఐదు సంవత్సరాల క్రితం మనం చాలా సంతోషంగా ఉన్నాం".

భార్య: "అదేమిటి? మనకి పెళ్లి అయి నాలుగు సంవత్సరాలే కదా అయింది"

భర్త: "నేను కూడా అంటున్నాను. అయిదు సంవత్సరాల క్రితం మనం చాలా హ్యాపీ కదా!"

**- ఈ.ఎస్.మాధవన్**

# తెలుగు భాష ప్రాచీన వైభవం

జయసూర్య






**పురాతత్వ శిలా శాసనాలు, ప్రాచ్య లిఖిత భాషా వాఙ్మయ స్వరూపాలు భాషా ఆవిర్భావ, వికాసాన్ని చారిత్రకంగా, ప్రాచీనతా విలువలతో స్పష్టం చేస్తాయి. 15వ శతాబ్దం వరకు తెలుగు, కన్నడ భాషలు యించుమించు సారూప్య లిపి, అక్షర స్వభావం కారణంగా భాషా భేదం లేకుండా అన్యోన్యంగా కలిసి వున్నాయి.**

ఇక తమిళ ప్రసక్తి గుర్తు చేసుకొంటే- తెలుగు, తమిళనాట ఎంతగా మమైక్యమైనదీ స్పష్టమే. ఉమ్మడి మద్రాస్ కాలంలోను, అంతకు ముందు శతాబ్దాలలో ప్రాంతీయ భాషా విభేదాలు లేవు, తెలియవు. సంగీత, సాహిత్యాలలోనే కాదు అన్ని రంగాలలోను కలిసి మెలిసి జీవించేవారు. స్వాతంత్ర్యానంతరం, భాషల ప్రాతిపదికన పాలనా సౌలభ్యం దృష్ట్యా ప్రత్యేక రాష్ట్రాలు ఆవిర్భవించడంతో పరిస్థితులు మారిపోయాయి.

క్రీ.శ.902 నుంచి 975 వరకు తెలంగాణ సీమలోని వేములవాడ స్వస్థలంగా చాళుక్యరాజు అరికేశరి రాజాశ్రయం పొందిన 'పంపడు', తెలుగువాడైనప్పటికీ కన్నడ ఆదికవిగా విలసిల్లిన చరిత్ర వుంది. త్యాగరాజస్వామి, శాస్త్రీయ సంగీతామృతాన్ని ప్రసాదించి తమిళులకు నేటికీ ఆరాధ్యనీయులయినట్టే, పంపన కన్నడ ఆది మహాకవిగా గుర్తింపు పొందారు. గుంటూరు జిల్లా వంగిపర్రు వేంగీదేశం నుంచి తరలివచ్చిన పంపన మహాకవి 'కవితా గుణార్ణవ' బిరుదాంకితునిగా నన్నయకంటే ముందు శతాబ్దిలో విలసిల్లాడు. 'విక్రమార్జున విజయం' లేదా పంపభారత 'ఆదిపురాణ' చంపూ కావ్య సృష్టికర్తగా కర్ణాటక సాహితీ సామ్రాజ్యంలో ప్రతిష్ఠత పొందారు. పంప మహాకవి సోదరుడైన జినవల్లభుడు, తాము తెలుగువారమని, తెలుగునాట నివసించామని సూచించటానికా అన్నట్టుగా తన శాసనం చివర మూడు కందపద్యాలు చెక్కించాడు. పురాతత్వ శాసన పరిశోధకుడు, వేములవాడ చాళుక్య చరిత్రను ఆంగ్లంలో ప్రకటించిన డా॥ నేలటూరి వేంకట రమణయ్య జినవల్లభుని శాసనం కనుక్కోవడంతో పంప మహాకవి సమాధి బోధన్‌లో వెలుగు చూసింది.

**"జిన భవనంబు లెత్తించుట**
**జిన పూజల్సేయు చున్కి జినమునులకు న**
**త్తిన యన్నదానం బీవుట**
**జిన వల్లభు బోలనలరె, జినధర్మపరుల్"**

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ తెలుగు భాషకు 'శాస్త్రీయ హోదా' అంశానికి సంబంధించే సత్కృషి, పై కంద పద్యాల ఆధారంగా విజయవంతమైంది.

తెలుగుకు ప్రాచీన శాస్త్రీయ హోదా పొందే అర్హత లేదని చెన్నైలో తల ఎత్తిన కుయుక్తి వివాదాన్ని తెలంగాణ ప్రభుత్వం పంపన-జినవల్లభ సోదరుల తెలుగు కవితా వైభవ ప్రాచీనతను నిరూపించి తిప్పికొట్టింది.

కొందరు కన్నడ పండితులు పంపన తెలుగువానిగా గుర్తించడానికి ఇష్టపడలేదు. పంపనను పూర్వ వంశీకులు కన్నడ సీమలో స్థిరపడినవారని, తదనుగుణమైన సిద్ధాంత రాద్ధాంతాలు సృష్టించారు. 1928లో 'భారతి'లో డా॥ నేలటూరి రాసిన వ్యాసం నాటి కన్నడ సాహితీ పండితులలో సంచలనం రేకెత్తించింది. పంపన తెలుగుదేశంలో పుట్టి, తెలుగునాట రాజాశ్రయంలో వున్నారని, ఇక్కడే వారి సమాధి బహిర్గతం కావడం కన్నడ పండిత పరిశోధకులకు రుచించలేదు. శాసనాధారాలతో నాటి 'భారతి' ప్రచురించిన ఆ వ్యాసం వారికి అసహనం కలిగించింది.

పల్లవ, చాళుక్య, చోళ, కాకతీయ, విజయనగర, నాయక, వెలుగోటి రాజ్య వంశ చరిత్రలలో తెలుగుకు సంబంధించిన నిక్షిప్త చరిత్రను డా॥ నేలటూరి వేంకట రమణయ్య బహిర్గతం చేయడం నాటి తెలుగు సాహితీ చారిత్రక పరిశోధకులకు అత్యంత ఉత్సాహం కలిగించింది.

1971 ఫిబ్రవరి భారతిలో 'తి.రా'(తిరుమల రామచంద్ర కావచ్చు) అనే సాహితీవేత్త యిలా రాసారు.

"ఎనభయ్యవ పడిలో నేలటూరి వెంకట రమణయ్య 'గట్టుదాటి గుట్ట దాటి ఘనమైన అడవిదాటి బొమ్మలగుట్ట ఎక్కి, పంపమహాకవి తమ్ముడు జినవల్లభుని శాసనం కనుక్కొన్నారు. జిల్లా వృత్తాంత దర్శినీ సహాయ సంపాదకులుగా కాళ్లకు బలపాలు కట్టుకొని ఊరూరూ, పల్లె పల్లె తిరిగి అమూల్య నిక్షిప్త విషయాలు సేకరించి ఆంధ్రజాతి చరిత్ర, సంస్కృతి భాండాగారాన్ని నింపగలిగారు" అన్నారు.

నన్నయ ప్రప్రథమ ఆదికవిగా భావిస్తే తెలుగుకు 1500 సంవత్సరాల ప్రాచీనత లేకపోవడంతో ప్రాచీన శాస్త్రీయ హోదా లభించే అవకాశం లేదు. తెలంగాణ ప్రభుత్వం తరపున భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ పండిత, కవి ప్రముఖుల సత్కృషి ఫలించి 902-975లలో వేములవాడ చాళుక్యుల కాలంలో జీవించిన పంపన సమాధి నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని పరిశోధనా ఫలితంగా తెలుగుకు కేంద్ర ప్రభుత్వ ఆదరణ లభించింది. భారతదేశంలో ప్రాచీన హోదా వున్న భాషల సరసన మన మాతృభాషగా, ఇప్పుడు రెండు రాష్ట్రాలలో విజయకేతనం ప్రతిష్ఠాత్మకంగా ఎగురవేయగలిగింది.

# ఉత్తర పర్వం

**ఆయన ఒక ఆధ్యాత్మికవేత్త. ఆయనకు ఎన్నో అలవాట్లు ఉన్నాయి. అయితే ఆయన దగ్గర నేను చూసి ఆశ్చర్యపోయిన ఓ అలవాటు ఉంది.**

యామిజాల జగదీశ్

అదేంటో తెలుసా.. తను అందుకున్న ఉత్తరానికి వెంటనే జవాబు రాయటం. పైగా ఆయన రోజుకో ఊళ్లో ఉంటారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తుంటారు. ఆయనకు ఉత్తరం రాసినవారు తెలిసినవారైనా కావచ్చు, తెలియని వారైనా కావచ్చు. వెంటనే ఓ కార్డులో రెండు వాక్యాలు రాసి పోస్టు చేస్తారు. మనలో చాలా మందికి ఆ అలవాటు బొత్తిగా లేనే లేదు. ఏదైనా ఉత్తరం అందుకుంటే ప్రత్యుత్తరం రాయాలి అనుకుంటారు తప్ప రాయరు. ఆలస్యం చేస్తుంటారు.

ఓ మనిషి మీద మనకున్న అభిమానానికీ, ప్రేమకూ, ఆప్యాయతకూ ఉత్తరం అనేది ఓ ముఖ్యమైన అంశం. అయితే అది రాయడానికి కాస్తంత శ్రద్ధ ఉండాలంతే! ఈరోజు మనకో ఉత్తరం వచ్చిందనుకోండి. దానికి వెంటనే ఉత్తరం రాసి పోస్టు చేసే మనకు ఉత్తరం రాసినవారి మనసులో మనకో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది.

ఉత్తరం రాసేటప్పుడు చెప్పవలసిన విషయాన్ని స్పష్టంగా రాయాలి. అది చదివితే మన మనసు వారికి అర్థం కావాలి. ఉత్తరం చాంతాడంత ఉండకూడదు. మనం ఏదో ఆఫీసులో పని చేస్తున్నామనుకోండి. మన కుటుంబ సభ్యులు ఏదో ఊరికి వెళ్లారు. వారికి ఉత్తరం రాయాలి అనుకోండి. ఆ సమయంలో ఓ స్టెనోని పిలిచి ఉత్తరం డిక్టేట్ చేసి ఫర్ అని రాసి మన కోసం ఇంకెవరో సంతకం చేసి డిస్పాచ్ విభాగానికి ఇచ్చి పంపించమంటే ఏమన్నా బాగుంటుందా?

ఆఫీసు ఉత్తరాలైతే టైప్ చేయొచ్చు. అది మన తరపున మరెవరో సంతకం చేయొచ్చు. కానీ పెళ్లానికో, మిత్రులకో రాసే ఉత్తరాలు మనమే స్వయంగా రాయాలి. అది అన్ని విధాలా సబబు. టైప్ చేసే ఉత్తరాలలో హృదయం కనిపించదు, యంత్రమే తెలుస్తుంది.

ఉత్తరాలలో దేనినీ అతిగా రాయకూడదు. చదివేవారి మనసు బాధ పడకూడదు. అలా బాధపడితేవారి మధ్య బంధం దెబ్బతినొచ్చు.

మనం ఎవరినైనా ఆట పట్టించడం కోసం ఉన్నదీ లేనిదీ రాయకూడదు. కనుక ఎందుకొచ్చిన గొడవ.. ఉత్తరం రాసేటప్పుడు జాగ్రత్తగా రాయాలి.

మనకు వచ్చే ఉత్తరాలను ఓ చోట వరుసగా ఉంచుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ పడేయకూడదు. చాలా జాగ్రత్తగా ఉంచాలి.

ఎవరు చూడొచ్చారనుకుని ఎక్కడ పడితే అక్కడ ఉత్తరాలను పడేయకూడదు. అందులో విషయాలు ఎవరైనా చదివి అపార్థం చేసుకునే వీలుండొచ్చు. అప్పుడు అనవసరంగా మనస్పర్థలు తలెత్తుతాయి. ఇంకొక ముఖ్యమైన విషయం... మగవాళ్లు స్త్రీలకు రాసేటప్పుడు; అలాగే స్త్రీలు మగవారికి రాసేటప్పుడు మాటల వాడుకలో చాలా జాగ్రత్తగా ఉండాలి. అటూ ఇటూ ఒక అక్షరం మారినా అర్థాలు మారిపోయి లేనిపోని గొడవలకు తావివ్వవచ్చు. మనం ఒక్కొక్కప్పుడు సవ్యంగానే రాసి ఉండొచ్చు. కానీ చదివే వ్యక్తి దానిని సరిగ్గా చదవకుంటే అందువల్ల తలెత్తే సమస్యలు వేరు.

అప్పుడు మనం నేను ఆ అర్థంతో రాయలేదు, ఈ అర్థంతో రాయలేదు అని వివరణలు ఇచ్చుకోవలసి ఉంటుంది. మనం ఎవరికి ఉత్తరం రాసినా సరే, పోస్టు చేసే ముందు దానిని మళ్లీ ఒకసారి చదవడం మంచిది. చిన్నపాటి అక్షరం దోషం కూడా ఇద్దరి మధ్య సమస్యలు సృష్టించవచ్చు.

అలాగే మరొక విషయం. ఒకే సమయంలో అనేక ఉత్తరాలు రాసేటప్పుడు కవర్ మీద అడ్రస్ సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి. చిరునామా స్పష్టంగా ఉండాలి. పిన్ కోడ్ తెలిస్తే అది కూడా రాయడం అన్ని విధాలా మంచిది. అంతేకాదు, పోస్టు చేస్తున్నప్పుడు కవరుకి తగిన స్టాంపులు అతికించాలి. ఉత్తరం అందుకునే వ్యక్తి డ్యూ కట్టుకుంటాడులే.. అని అనుకోకూడదు. అది సంస్కారం కాదు.

ఇవన్నీ సాధారణ విషయాలే కావచ్చు. అయినా సక్రమంగా నడచుకోవలసిన విషయాలివి.

........

ఓ పోస్టు బాక్సు ముందర ఓ వ్యక్తి బాధతో తల పట్టుకుని నిల్చున్నాడు.



"ఏమిటీ సార్, ఏమైంది?" అని అడిగాను.

ఓ తప్పు జరిగిపోయిందండీ! ఓ కవరు ఈ బాక్సులో వేసానండి. కానీ ఆ కవరులో నేను రాసిన కాగితాలు ఉంచడం మరిచానండీ" అన్నాడు.

అప్పుడు నేనన్నాను కదా.. "మీరు అలా చేస్తే నేనేం చేసానో తెలుసాండీ? ఓసారి ఉత్తరం అంతా రాసి కవరులో పెట్టి అతికించాను. కానీ చిరునామా రాయకుండా ఏదో ధ్యాసలో కవరు పోస్టు బాక్సులో వేసానండి" అని చెప్పాను.

ఇదంతా బాగానే ఉంది కానీ ఈ రోజుల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు అనేవి చాలా అరుదుగా జరుగుతున్న సంగతి తెలిసిందే! అయినా నాకు తోచిందేదో చెప్పాలనిపించింది. ఇప్పుడంతా వాట్సప్‌లు, టెలిగ్రామ్ యాప్‌లూ ఉన్నాయి చాట్ చేయడానికి. కానీ అందులో ఏమానందం ఉంటుంది. రాసి ఉత్తరం పోస్టు చేయడం, రాసిన ఉత్తరం అందుకోవడంలో ఉన్న ఆనందమే వేరు కదండీ. ఆ రోజులు మళ్లీ వస్తాయా? అన్న నా ఆశ అత్యాశే అంటారా? ■

# ఇతరులకు సహాయం చేస్తే..


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




**కొంతమంది నిజంగా డబ్బు చాలా అవసరమైన పరిస్థితిలో ఉంటారు. అంటే పిల్లలకి స్కూల్ ఫీజులు కట్టాలంటే లాస్ట్ డేట్ కావచ్చు. ఏదైనా హాస్పిటల్ ఎమర్జెన్సీలో డబ్బులు కట్టాల్సిన పరిస్థితి కావచ్చు. వాళ్ళకి ఆ టైం లో డబ్బులు వచ్చే మార్గం కూడా ఏమీ కనిపించదు. అలాంటి టైం లో వాళ్ళు ఏం చేయాలంటారు?**

ఇటువంటి సందర్భం ప్రతి ఒక్కరికి లైఫ్‌లో ఎప్పుడో ఒకసారి వస్తూనే ఉంటుంది. ఇలాంటి సమయంలో చిరాకు పడిపోవటం, ఇతరుల మీద విసుక్కోవటం, తమ ఆందోళనను ఇంకొకరి మీద చూపెట్టటం... ఇటువంటి పనులు మాత్రం చేయకూడదు. మనకి తట్టుకోలేని పరిస్థితి కానీ, ఒక కష్టం కానీ వచ్చింది అంటే దాన్ని అనుకూలంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అంటే 'ప్రకృతి మనకి ఏదో నేర్పించే ప్రయత్నం చేస్తున్నది' అన్న విషయం మనం అర్థం చేసుకోవాలి. ప్రకృతికి మన స్పందన ఒక ఉన్నతమైన ప్రమాణంలో తెలియజేయాల్సిందిగా ఉండాలి. ఇలా చెప్పటం సులభమే కానీ క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రకృతికి మన స్పందనలో ఉన్నతమైన ప్రమాణాలు ఉండాలన్న తలంపు ఆలోచనల్లోకి రాదు. కానీ ఈ విషయం అర్థం చేసుకుంటే అప్పటి సమస్యను లేదా కష్టాన్ని ఎదుర్కొనే తీరు మారిపోతుంది. మీకు అత్యవసరంగా డబ్బులు కావాలి. ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ కూడా అప్పు పుట్టటం లేదు. అవసరానికి సరిపడా డబ్బులు దొరకటం లేదు.



చాలా చికాకుగా ఆందోళనతో ఉన్నారు. ఇటువంటి సందర్భంలో సాధారణంగా ఏం జరుగుతుందంటే..

ఎవరో ఒక కష్టంలో ఉండి ఒక సహాయం కోసం మీ దగ్గరకు రావచ్చు. లేదా వాళ్లకి కూడా డబ్బులు అవసరమై ఉండి మీ దగ్గరికి వచ్చి ఒక సహాయం అడగవచ్చు. కొంత డబ్బు అప్పుగా కూడా అడగవచ్చు.

అటువంటప్పుడు ప్రకృతి మీకు సహాయం చేయటానికి ప్రయత్నిస్తున్నది అని అర్థం చేసుకోండి. మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ఇలా ఎవరో ఒకరు వచ్చి మిమ్మల్ని సాయం అడగడమే... 'ప్రకృతి మీకు సహాయం చేయటానికి ప్రయత్నిస్తున్నది' అని చెప్పుకోవటానికి కొండ గుర్తు. అదే రకమైన కష్టంలో మీరు ఉన్నారు. ఎవరైనా మీకు సాయం చేస్తారేమో అని ఎదురు చూస్తున్నారు. మీరే డబ్బులు కోసం తిరుగుతున్నారు. ఇంకొకరు వచ్చి మిమ్మల్ని డబ్బులు అడుగుతున్నారంటే మీకు ఇంకా విసుగు రావచ్చు. కోపం రావచ్చు. అతనికి మీరు కూడా మీ పరిస్థితి అంత ఏకరువు పెట్టేసి, మీ నిస్సహాయతను చూపెట్టి, ఏమి హెల్ప్ చేయకుండా, అప్పుకు కూడా ఇవ్వకుండా పంపించి వేస్తారు. సాధారణంగా ఇలాగే జరుగుతుంది. ఇక్కడ మీ స్పందన ఏదైతే ఉందో అది చాలా ముఖ్యం. నేనే నా కోసం కష్టంలో ఉన్నాను. అటువంటిది నువ్వు వచ్చి నన్ను సహాయం అడుగుతున్నావేంటి. లేదా డబ్బులు అడుగుతున్నావేంటి అనే ఇట్లాంటి మాటలు కాకుండా ఆప్యాయంగా, ఆదరంగా ట్రీట్ చేయండి. వాళ్లు తమ కష్టం నుండి బయటపడటానికి మీరు చేయదగినది ఏదైనా సహాయం ఉంటే, మొత్తం కాకపోయినా మీరు చేయగలిగినంత, మీ శక్తికి తగినంత ఎంతో కొంత చేయండి. ఉదాహరణకి వాళ్ళు డబ్బుల కోసం మీ దగ్గరికి వచ్చారు అనుకోండి. మీరు అప్పటికే డబ్బుల కోసం కష్టంలో ఉన్నారు. వాళ్లు అడిగిన మొత్తాన్ని అంతా మీరు ఇవ్వలేకపోయినా, మీ శక్తికి తగ్గట్టు ఎంతో కొంత సమకూర్చండి. మీకు ఒక లక్ష రూపాయలు అవసరమై తిరుగుతున్నారనుకోండి... ఉదాహరణకు చెప్తున్నాను. ఒకరు మీ దగ్గరకు వచ్చి వెయ్యి రూపాయలు అప్పు అడిగారనుకోండి. లక్ష రూపాయలు కోసం ప్రయత్నిస్తున్న మీకు ఒక వెయ్యి రూపాయలు సర్దటం పెద్ద కష్టం కాదు. 1000 కాకపోతే మీ దగ్గర ఎంత ఉంటే అంత ఇచ్చి, నా దగ్గర ఇంతే ఉంది. ఇంతకంటే లేదు అని చెప్పి, వీలైతే కాఫీ, ఫలహారాలు ఇవ్వండి. అవి వీలుకాకపోతే కనీసం గ్లాసు నీళ్ల అయినా ఇవ్వండి. వారు మీరిచ్చిన డబ్బును తీసుకొని మీ ఎడల కృతజ్ఞతతో సంతోషంగా వెళ్లేటట్టు చూడండి. ఆ తర్వాత మీకు అవసరమైన డబ్బు కోసం మీరు చేసే ప్రయత్నాలు మీరు కొనసాగించండి. ఇదివరకు మీ ప్రయత్నాలకి డబ్బు పుట్టకపోయేది. అప్పుడు వచ్చిన ప్రతికూల ఫలితాల (నెగెటివ్ రిజల్ట్స్) కంటే ఇప్పుడు వచ్చే అనుకూల ఫలితాలు (పాజిటివ్ రిజల్ట్స్) మెరుగ్గా ఉంటాయి. ప్రకృతి మీకేదో నేర్పిస్తుంది. నువ్వు కష్టాల్లో ఉన్నప్పుడు నువ్వు ఎంత బాధలో ఉన్నావో నిన్ను ఒక మనిషి వచ్చి అడుగుతున్నాడు అంటే–

(మిగతా 27వ పేజీలో..)

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .............

చిరునామా:..............................................

# అవసరానికి మించి యాచించకూడదు

కస్తూరి మురళీకృష్ణ

అది శాస్త అళవీకి దగ్గరలో ఉన్న అగ్గాళవ చైత్యంలో విహరిస్తున్న సమయం. అగ్గాళవ చైత్యం అళవీ రాజ్యంలోని ప్రధాన చైత్యం. నిజానికి అగ్గాళవ చైత్యం మొదట్లో బహు దేవతలను ఆరాధించేవారి మందిరం. కానీ అది చైత్య విహారంగా రూపాంతరం చెందింది. మణిమండల జాతకాన్ని బుద్ధుడు వినిపించింది ఇక్కడే. అగ్గాళవ చైత్యంలో ఒకరోజు బుద్ధుడు భిక్షువులను ప్రశ్నించాడు.

“భిక్షువులారా, మీరు మీకు తగినంత మాత్రమే భిక్షను కోరుతున్నారా? లేక మీకు అవసరమైన దానికన్నా ఎక్కువగా భిక్షను కోరుతున్నారా?

శాస్త అడిగిన ప్రశ్నకు సమాధానంగా కొందరు భిక్షువులు “మేం మాకు అవసరమైనదాని కన్నా ఎక్కువగా భిక్షను కోరుతున్నాం” అని ఒప్పుకున్నారు.

దానికి శాస్త వారిని మందలించారు.

“క్రమశిక్షణ అన్నది నియమం కోసం. నియమం వల్ల ‘అతి’ నుంచి స్వేచ్ఛ లభిస్తుంది. ఆనందం వల్ల శాంతి లభిస్తుంది. అందుకని ఎంత అవసరమో అంతగానే అభ్యర్థించటం అన్నది నియంత్రణ, క్రమశిక్షణ వల్లనే వస్తుంది” అన్నాడు.

భిక్షువులు తమ పొరపాటు గ్రహించారు. సిగ్గుతో తలలు వంచుకున్నారు.

“పూర్వకాలం పండితులు, రాజును ఆకుల గొడుగు, కాలిజోడు జతలను అడగాలని అనుకుని కూడా సిగ్గు వల్ల అందరి ముందు అభ్యర్థించలేక ఏకాంతంలో రాజును వేడుకున్నారు” అన్నాడు శాస్త.

అది విన్న భిక్షువులలో ఆ పూర్వ గాథ వినాలన్న కోరిక కలిగింది. ఆ కథను చెప్పమని శాస్తను వారు అభ్యర్థించారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త వారికి పూర్వ గాథ వినిపించటం ఆరంభించాడు.

...........

అది కంపిలలోని ఉత్తర పాంచాల నగరాన్ని పాంచాల రాజు పరిపాలిస్తున్న కాలం. ఆ కాలంలో బోధిసత్త్వుడు ఒక పల్లెలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు.



తక్షశిలలో విద్య పూర్తి చేశాడు. ప్రవ్రజించాడు. హిమాలయాలు చేరి కందమూల ఫలాలు తింటూ జీవితం గడపటం ఆరంభించాడు.

ఆయనకు ఒకసారి ఉప్పు, పులుపు అవసరమయ్యాయి.

వాటి కోసం ఆయన హిమాలయాలు వదలి గ్రామాలలో ప్రవేశించాడు. అలా తిరుగుతూ ఉత్తర పాంచాల దేశం చేరాడు.

పాంచాల దేశంలో రాజోద్యానవనంలో ఉండసాగాడు. భిక్షకోసం నగరంలోకి పోయేవాడు. తగినంత భిక్ష లభించిన తరువాత మళ్లీ ఉద్యానవనం వచ్చి చేరేవాడు.

అతడి చర్యను గమనించిన రాజు అతడి ప్రవర్తనకు ముగ్ధుడయ్యాడు. అతడిని పిలిచి, పెద్ద పీటపై కూర్చోబెట్టి రాజభోజనం పెట్టించాడు. అతడికి ప్రతిరోజు రాజభోజనం వచ్చేట్టు ఏర్పాటు చేశాడు. ఇష్టమైనంత కాలం ఉద్యానవనంలో ఉండేట్టు ఆజ్ఞలు జారీ చేశాడు.

బోధిసత్త్వుడు కొన్నాళ్లు అక్కడ ఉన్నాడు.

వర్షాకాలం దగ్గర పడుతుండగా హిమాలయాలు వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాడు. అయితే వర్షాకాలం కాబట్టి, దారిలో వర్షాల నుండి రక్షణగా ఒక గొడుగు, ఒక చెప్పుల జత ఉంటే బాగుంటుందని అనుకున్నాడు.

తనకు అవసరమైన వస్తువులను రాజును అభ్యర్థించాలని నిశ్చయించుకున్నాడు.

మరుసటి రోజు ఉద్యానవనానికి వచ్చిన రాజు బోధిసత్త్వుడికి ప్రణామం చేశాడు. అతడి సమీపంలో కూర్చున్నాడు.

అయితే అప్పుడు రాజు చుట్టూ ప్రజలు, సేవకులు అనేకులున్నారు. వారందరినీ చూసిన తరువాత బోధిసత్త్వుడికి ఓ ఆలోచన వచ్చింది... “ఎదుటి వాడిని యాచించటం చావు లాంటిది. ఎంతో ఆలోచించి తప్పనిసరి పరిస్థితులలోనే ఇది కావాలి అని అభ్యర్థిస్తాడు మనిషి. ఒకవేళ ఇతడు సగం చచ్చి యాచించింది లేకపోతే లేదనటానికి లేదనేవాడు బాధపడతాడు.

అతడు అడిగి లేదనిపించుకున్నందుకు అడిగినవాడు బాధపడతాడు. ఇలా ఇద్దరూ విచారపడాల్సిన పరిస్థితి వస్తే అది సామాన్యుల దృష్టిలో పడకూడదు. కాబట్టి అందరి ముందూ రాజును అభ్యర్థించేకన్నా ఎవ్వరూ లేనప్పుడు అభ్యర్థించటం మంచిది” అనుకునానడు.

“మీతో ఏకాంతం కావాలి” అన్నాడు రాజుతో.

అందరినీ దూరం వెళ్లిపొమ్మన్నాడు రాజు.

అంతలో మరో సంశయం పొడసూపింది బోధిసత్త్వుడి మనసులో.

"నేను గొడుగు, చెప్పులు అడుగుతాను, రాజు లేవంటాడు. అప్పుడు మనస్సులో కోపం కలగవచ్చు. అది మా స్నేహాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి అడిగి స్నేహాన్ని పాడు చేసుకోవటం కన్నా అడగకుండా మౌనంగా ఉండటం మేలు" అనుకున్నాడు బోధిసత్త్వుడు.

"చెప్పండి" అన్నాడు రాజు, ఏకాంతం ఏర్పాటు కాగానే.

"ఏమీ లేదు. మరోరోజు చెప్పాడతను. ఈరోజు కాదు" అన్నాడు బోధిసత్త్వుడు.

ఆ తరువాత నుంచి రాజు ఎప్పుడు కలిసినా "మీరు ఏదో చెప్తానన్నారు" అని గుర్తు చేసినా బోధిసత్త్వుడు "ఈరోజు కాదు మరో రోజు అనీ; ఈసారి కాదు, మరోసారి అనీ" వాయిదా వేస్తూ వచ్చాడు.

అలా పన్నెండు ఏళ్లు గడిచిపోయాయి.

చివరికి రాజు మనసులో వేరే ఆలోచనలు వచ్చింది.

"ఈయన ఏకాంతం కోరతాడు. అందరినీ దూరం పంపేసిన తరువాత ఏమీ కోరడు, మాట్లాడడు. ఏదో చెప్పాలనుకుంటున్నాడు. కానీ చెప్పలేకపోతున్నాడు.

ఈయన ఇన్నేళ్లు బ్రహ్మచర్యం గడిపాడు. ఎలాంటి సౌఖ్యం ఆశించకుండా కఠినమైన పరివ్రాజక జీవితాన్ని గడుపుతున్నాడు. బహుశా, ఈయన మనస్సు భోగాల అనుభవించే వైపు మళ్లిందేమో! కానీ అడిగితే ఏమనుకుంటాడోనని జంకుతున్నట్టున్నాడు. ఈరోజు నేనే అడిగేస్తాను. ఆయన ఏమడిగితే అవి ఇచ్చేస్తాను. చివరికి నా రాజ్యం అడిగినా రాజ్యం కూడా ఇచ్చేస్తాను" అని నిశ్చయించుకున్నాడు.

అలా నిశ్చయించుకున్న తరువాత ఉద్యానవనం చేరాడు. బోధిసత్త్వుడికి ప్రణామం చేసి దగ్గరలో కూర్చున్నాడు.

ఎప్పటిలాగే బోధిసత్త్వుడు ఏకాంతం కోరాడు.

రాజు అందరినీ వెళ్లిపొమ్మన్నాడు.

ఎప్పటిలాగే ఏకాంతం ఏర్పాటయిన తరువాత బోధిసత్త్వుడు ఏమీ మాట్లాడలేదు.

అప్పుడు రాజే చొరవ తీసుకున్నాడు.

"మీరు రోజూ ఏకాంతం కోరుతున్నారు. ఏదో చెప్పాలనుకుంటున్నారు. కానీ చెప్పలేకపోతున్నారు. ఇలా పన్నెండు సంవత్సరాలు గడిచిపోయాయి. మీరు ఏం కోరితే అది ఇస్తాను. ఏమేం భోగభాగ్యాలు కోరితే అవి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. చివరికి మీకు నా రాజ్యం కావాలా? రాజ్యం కూడా ఇచ్చేస్తాను. మీకు ఏం కావాలో నిస్సందేహంగా, నిర్భయంగా అడగవచ్చు" అన్నాడు రాజు.

బోధిసత్త్వుడు కాసేపు మౌనంగా ఉన్నాడు. చివరికి మెల్లిగా "నేనేం అడిగితే అది ఇస్తారా?" అని అడిగాడు.

"మీరు అడిగి చూడండి. మీరు ఏది కోరితే అది ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను" అన్నాడు రాజు.

"నేను హిమాలయాలకు వెళ్లాలనుకుంటున్నాను. నాకు దారిలో నడవటానికి కాళ్లకు చెప్పులు కావాలి; ఎండ, వాన నుండి రక్షణగా ఓ గొడుగు కావాలి".

బోధిసత్త్వుడి కోరిక విని రాజు మౌనంగా, అపనమ్మకంగా బోధిసత్త్వుడికేసి చూస్తూ కూర్చున్నాడు.

"మీకు కావాల్సినవి ఇవేనా? వీటిని మీరు పన్నెండేళ్లుగా అడగలేకపోతున్నారా?" అని విస్మయంగా అడిగాడు రాజు.

"అవును" అన్నాడు బోధిసత్త్వుడు.

"ఇవి అడగటానికి మీరు ఏకాంతం కోరారా?" నమ్మశక్యం కాక అడిగాడు రాజు.

"ఎవరు యాచిస్తాడో వాడు ఎంతో బాధపడుతూ అడుగుతాడు. నేను అడిగిన తరువాత మీరివ్వలేకపోయినా, ఇవ్వకపోయినా ఇద్దరం బాధపడతాం. అందుకని ఏకాంతంలో అడగాలని అనుకున్నాను. కానీ మీరు కాదంటే మైత్రీభంగం అవుతుందేమోనన్న జంకుతో ఏకాంతంలోనూ అడగలేకపోయాను" అన్నాడు.



రాజు ఆశ్చర్యం నుండి తేరుకున్న తరువాత "గొడుగు, చెప్పులేమి ఖర్మ, మీకు నేను వెయ్యి గోవులను, వృషభాలను కానుకగా ఇస్తాను" అన్నాడు.

బోధిసత్త్వుడు రాజును వారించాడు. "నాకు వస్తువులపై కోరిక లేదు. నేను కోరిన గొడుగు, పాదుకలు ఇస్తే చాలు. గోవులు, వృషభాలను నేను ఏం చేసుకుంటాను" అన్నాడు.

రాజు ఎంత పట్టుదల ప్రదర్శించినా బోధిసత్త్వుడు మాట నుండి వైదొలగలేదు. రాజు ఏమిస్తానన్నా "నాకు గొడుగు, ఒక జత చెప్పులు చాలు" అంటూనే ఉన్నాడు.

బోధిసత్త్వుడి మాటలకు రాజు లొంగక తప్పలేదు. అతడు కోరినట్టు గొడుగు, చెప్పులు ఇచ్చాడు.

అవి తీసుకుని బోధిసత్త్వుడు హిమాలయాలు చేరాడు. బ్రహ్మలోక పరాయణుడయ్యాడు.

పూర్వగాథ ముగింపులో శాస్త "ఈ గాథలో రాజు ఆనందుడు, ఆ తపస్వి నేనే" అని చెప్పాడు. ■

**(25వ పేజీ తరువాయి..)**

వాడు కూడా అంతే బాధలో ఉన్నాడు అని అర్థం చేసుకొని, వాడి ఆందోళనలను మీరు శక్తివంచన లేకుండా తీర్చగలిగితే మీ ఆందోళనను తీర్చగలిగే సహాయం ప్రకృతి నుండి అనుగ్రహింపబడుతుంది.

ఇదివరకట్లా కాకుండా ఇప్పుడు మీకు డబ్బులు దొరికే అవకాశాలు పెరుగుతాయి. లేదా మీ సమస్యను పూర్తిగా పరిష్కరింపబడవచ్చు. ఇది చాలా చిన్న విషయం అనుకోకండి. ఇది మీరు చేసి చూడండి. తప్పకవచ్చి మిమ్మల్ని డబ్బులే అడగకపోవచ్చు... ఇంకా ఏదైనా విషయంలో సాయం అడగొచ్చు. అప్పుడు మీ శక్తివంచన లేకుండా మీ వంతు సాయం మీరు చేయండి. ప్రకృతి నుంచి వచ్చే సహాయం సూపర్‌గా ఉంటుంది. ఇది ఒక్కొక్కసారి కొంతమందికి సిల్లీగా కూడా అనిపించవచ్చు. కానీ మీరు చేసి చూడండి. ఇటువంటి అద్భుతమైన ఫలితాలు ఎవరికైనా తప్పనిసరిగా అనుభవంలోకి వస్తాయి.

# ఆలయ దర్శనం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# దేవదేవుడు కొలువైన క్షేత్రం

**భా**రతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ భారతీయులు స్థిరపడ్డారో అక్కడ మరో హిందూ దేవీ దేవతల ఆలయం లేకున్నా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని ఆలయం మాత్రం తప్పక కనపడుతుంది. ఏడు కొండల మీద యుగాల క్రితం కొలువైన శ్రీవారి పట్ల భారతీయులకు గల భక్తిప్రపత్తులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.



విదేశాలలోనే కాదు మన దేశంలో కూడా శ్రీ బాలాజీ ఆలయాలు ఎన్నో నెలకొని ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద తిరుపతితో పాటు చిన్న తిరుపతి కూడా ఉన్నది.

పశ్చిమ గోదావరి(ప్రస్తుత ఏలూరు జిల్లా) ఉన్న ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రం యుగయుగాల నుండి 'చిన్న తిరుపతి'గా పిలువబడుతుంది.

ఎన్నో విశేషాలకు నిలయమైన ద్వారకా తిరుమల త్రేతాయుగానికి ముందు నుండి ఉన్నదని క్షేత్ర పురాణగాథ తెలుస్తోంది.

## క్షేత్ర గాథ

కృత యుగంలో 'ద్వారక మహర్షి' శ్రీ మహావిష్ణువు' దర్శనాన్ని అపేక్షిస్తూ వందల సంవత్సరాలు తపస్సు చేశారట. అందువల్ల ఆయనచుట్టూ ఎత్తైన చీమల పుట్టలు ఏర్పడ్డాయట.

మహర్షి దీక్ష, భక్తిప్రపత్తులకు సంతసించిన వైకుంఠవాసుడు నిజరూప దర్శనమిచ్చారట. ద్వారక మహర్షి శ్రీరామచంద్రుని తాత అయిన శ్రీ అజ మహారాజు ఈ క్షేత్రంలో శ్రీనివాసుని సేవించారని బ్రహ్మ పురాణం పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

కానీ స్వామి వాల్మీకం పైన సాక్షాత్కరించినందున నడుమ కిందిభాగం శ్రీ ద్వారక మహర్షికి పాదసేవ నిమిత్తం అని పైభాగం సాధారణ భక్తుల దర్శనార్థం కోసం అంటారు.

వైష్ణవ క్షేత్రాలలో పెరుమాళ్ల పాద దర్శనానికి విశేష ప్రాముఖ్యం ఉన్నది. తొలినాళ్లలో ఆ పాద దర్శనం భక్తులకు లభించేది కాదని చెబుతారు.

పదకొండవ శతాబ్దానికి చెందిన శ్రీ వైష్ణవ ఆచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతకర్త అయిన శ్రీశ్రీశ్రీ రామానుజాచార్యులు గారు ద్వారకా తిరుమల క్షేత్రాన్ని సందర్శించారట. ఆయన అక్కడి వారికి పరమాత్మ పాద దర్శన ప్రాధాన్యతను వివరించి మరో అర్చనామూర్తిని స్వయంవ్యక్త రూపం వెనుక ప్రతిష్టించారని తెలుస్తోంది. అలా భక్తులకు శ్రీనివాసుని రెండు రూపాల పాద దర్శనం లభ్యమవుతోంది.

అర్ధ మండపంలో శ్రీ పద్మావతీ అమ్మవారు, శ్రీ నాంచారీదేవి, శ్రీ ఆండాళ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు కొలువై దర్శనమిస్తారు. గర్భాలయానికి ఎదురుగా శ్రీ ద్వారకా మహర్షి, కీర్తనాచార్య శ్రీ అన్నమయ్య విగ్రహాలు, ధ్వజస్థంభం వద్ద అంజనాసుతుడు, వినతానందనుడు స్వామివారికి ముకుళిత హస్తాలతో వందనం చేస్తూ కొలువై ఉంటారు. గర్భాలయ ప్రదక్షిణా పథంలో పన్నిద్దరు ఆళ్వారుల సన్నిధులుంటాయి.

## ఆలయ విశేషాలు

మొదటిగా చెప్పుకోవలసినది శ్రీవారు కొలువు తీరిన పర్వతం గురించి. అనంతుడు అనే సర్పరాజు ప్రార్థన మేరకు ద్వారకా మహర్షి అతను శిలా రూపం దాల్చిన పర్వతం మీద తపస్సు చేశారట. గమనిస్తే కింద నుండి పైకి వెళ్లే మార్గం పాము చుట్టుకొని ఉన్నట్లుగా కనిపిస్తుంది.

మనం శేషాచలం పర్వతాలను చూస్తే శిఖర భాగాన తిరుమలనాథుడు, తోక భాగాన శ్రీశైలవాసుడు, మధ్యలో శ్రీ అహోబిల నారసింహుడు కొలువై ఉంటారు. అదేవిధంగా ద్వారా గిరి మీద కూడా ఒక పక్కన శ్రీమల్లికార్జున స్వామి కొలువై దర్శనమిస్తారు. ఆ విధంగా ద్వారకా తిరుమల హరిహర క్షేత్రం.



ప్రధాన ఆలయాన్ని పద్దెనిమిదో శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన శ్రీ ధర్మ అప్పారావు ఆయన భార్య శ్రీమతి చిన్నమ్మారాణి నిర్మించేసినట్లుగా తెలుస్తోంది. స్వామివారికి అలంకరించే అధిక శాతం నగలు వారు సమర్పించారని అంటారు.



గత కొన్ని సంవత్సరాలలో ఆలయ అభివృద్ధి ఘనంగా జరిగింది. చక్కని గోపురాలు, మండపాలు, నిత్య కళ్యాణ మండపం, అతిథి గృహాలు, ఉద్యానవనాలు, భక్తులకు అవసరమైన ఇతర నిర్మాణాలను, విశాలమైన దారులు నిర్మించారు. భక్తులకు నిత్యాన్నదానం రూపంలో స్వామివారి ప్రసాదం వితరణ జరుగుతుంది.

ఇరవై సంవత్సరాల క్రితం ద్వారకా తిరుమలకు నేటి ద్వారకా తిరుమలకు ఏమాత్రం పోలికలేదు. చక్కని నిర్మాణాలతో, ఆధునిక సదుపాయాలతో కూడిన వసతులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండటం విశేషం.

## ఆలయ పూజలు, ఉత్సవాలు

ఉదయం



సుప్రభాత సేవతో మొదలై అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు అన్నీ నిర్ణయించిన విధానం మేరకు జరుపుతారు. ఏకాదశి, పౌర్ణమి, అమావాస్య తిథులలో; పునర్వసు, శ్రవణా నక్షత్రం ఉన్న రోజులలో, సంక్రమణంనాడు మండపంలో స్వామివారికి ప్రత్యేక అర్చన, ప్రసాద నివేదన చేస్తారు.

ఉగాది ఆస్థానం, శ్రీ సీతారామ కళ్యాణం, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రావణ మాసంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు, కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశినాడు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ధనుర్మాస పూజలు, భోగిరోజున జరిగే గోదా కళ్యాణం అపురూపం. ఇలా ప్రతిరోజు, ప్రతి నెల స్వామివారి దర్శనానికి, ఉత్సవాలకు తరలివచ్చే భక్త సందోహంతో ద్వారకా తిరుమల శోభాయమానంగా ఉంటుంది.

ఇవన్నీ ఒకటైతే వైశాఖ మాసంలో పది రోజుల పాటు నిర్వహించే తిరు కళ్యాణోత్సవాలు మరో ఎత్తు. అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.

పల్లె వాతావరణం, పర్వత శిఖరం, దేవదేవుడు కొలువైన క్షేత్రం, శబ్ద వాయు కాలుష్యం లేని సుందర రమణీయ ఆధ్యాత్మిక సౌరభాలను విరజిమ్మే అద్భుత క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువు తీరిన ద్వారక తిరుమల.

దివ్యక్షేత్రం అనగానే ఆ చుట్టుపక్కల కొన్ని అనుబంధ పురాతన ఆలయాలు తప్పనిసరిగా నెలకొని ఉంటాయి. అదేవిధంగా ద్వారక తిరుమల పరిసర గ్రామాలలో కూడా కొన్ని ఆలయాలు ఉన్నాయి. మొదటగా ద్వారకా తిరుమల గ్రామదేవత అయిన శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి దేవాలయం పర్వత పాదాల వద్ద ఉంటుంది. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి.

ద్వారక తిరుమల నుండి ఏలూరు వైపు వెళితే కిలోమీటర్ల దూరంలో 'చిన్నపూరి'గా పిలవబడే శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయం. లక్ష్మీపురం వస్తుంది. స్వామి సంతానాన్ని ప్రసాదించేవానిగా ప్రసిద్ధి. ద్వారకా తిరుమల నుండి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈస్ట్ యడవల్లి గ్రామంలో 'చిన్న భద్రాచలం'గా పిలిచే శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం(మద్ది శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో) ఉంటుంది. పురాతన ఆలయం. శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

చిన్న సింహాచలం అని పిలిచే శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉన్న ఐఎస్ జగన్నాథపురం ద్వారకా తిరుమలకు సుమారు ఇరవై ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. మరో దివ్య క్షేత్రం 'చిన్న అన్నవరం'గా పిలిచే రంగాపురంలో శ్రీ భూనీళా సమేత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం ఉన్నది. రంగాపురం ద్వారకా తిరుమలకు సుమారు ముప్పై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

సమీప పట్టణం, జిల్లా కేంద్రం అయిన ఏలూరుతో పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయాలు తప్పనిసరిగా దర్శనీయమైనవి.


## సరదా
## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్థు.
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: **9849453449, 9440927795**



## మేషం

మారుతున్న పరిస్థితులకు, ప్రపంచ స్థాయి పరిస్థితులకు కొన్ని సందర్భాలలో భయభ్రాంతులకు గురవుతారు. నిరాశా, నిస్పృహ కలుగుతాయి. కొన్ని కార్యక్రమాలను అర్థాంతరంగా ఆపేస్తారు. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. తగాదాలకు దూరంగా ఉండండి.



## వృషభం

వ్యక్తిగత ఎదుగుదల కోసం కొన్ని కోర్సులు చేపడతారు. ఉన్నత చదువులు చదువుకోవాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. నూతన పరికరాలు, ప్రక్రియల పట్ల అవగాహన పెంచుకుంటారు. కార్యాలయంలో మీకు ఉన్నటువంటి నైపుణ్యం, మంచి పేరు కొన్ని సందర్భాలలో ఉపయోగపడుతుంది. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి.




## మిథునం

నూతన ప్రాజెక్టులను అందుకుంటారు. టీ, టిఫిన్ సెంటర్స్, క్యాటరింగ్ వ్యాపారస్తులకు అనుకూలం. కోర్టు సంబంధమైన వ్యవహారాలు కోర్టు కన్నా బయట పరిష్కారమవుతాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అర్చన జరిపించండి. మధ్యవర్తుల ద్వారా ధన నష్టం కలిగినప్పటికీ కొన్ని సమస్యల నుండి శాశ్వతంగా బయటపడతారు. నూతన వాహనం కొనుగోలు.



## కర్కాటక

స్థలాల క్రయ-విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారులకు బాగుంటుంది. మహా పాశుపత కంకణం ధరించండి. ఉద్యోగం లభిస్తుంది. నూతన ఉపాధి పథకాలు ఆకర్షిస్తాయి. మధ్యవర్తుల ద్వారా లాభాలు అందుతాయి. రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అనుకున్న సమయానికన్నా ఆలస్యమవుతాయి. క్రయ-విక్రయాల్లో లాభాలు అందుకుంటారు.



## సింహం

కొంతమంది మాటలు విని మోసపోతారు. ఏ విషయంలో/వ్యవహారంలో అయినా మీ కళ్లతో చూసి, మీరు విన్న తరువాతే నిర్ణయం తీసుకోండి. ఆవేశంలో తొందరపాటు నిర్ణయాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణయం తీసుకోవద్దు. ఓం నమశ్శివాయ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. ప్రయోజనకరమైన అంశాలు ఆలస్యంగా తెలుస్తాయి.



## కన్య

జీవిత భాగస్వామితో అనురాగం, ఆప్యాయత కలిగి ఉంటారు. కొంతమంది ప్రవర్తన మీకు చికాకు కలిగిస్తుంది. అయినప్పటికీ వారి పట్ల ఓర్పు, సంయమనంతో వ్యవహరిస్తారు. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. విదేశీయాన ప్రయత్నాలు అనుకూలం. కొంతమందికి మన అవసరార్థం ధనాన్ని అందజేసి తద్వారా ప్రయోజనాలు పొందుతారు.




## తుల

విదేశాల నుండి ఆర్డర్లు అందుకుంటారు. విదేశీ ద్రవ్యం చేతికి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో పాల్గొంటారు. శుభకార్యాలు, విందు-వినోదాల్లో పాల్గొంటారు. జ్యేష్ఠ సంతానం పట్ల ఆసక్తి చూపిస్తారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. అయినవాళ్లతో వ్యాపారం చేయాలన్న ఆలోచనలకు దూరంగా ఉంటారు. ఈ విషయంలో కొంతమందికి మీ పట్ల వ్యతిరేక భావం ఏర్పడుతుంది.



## వృశ్చికం

సహోద్యోగులతో అకారణంగా విరోధాలు ఏర్పడవచ్చు. కొంతమంది వ్యక్తిగతమైనటువంటి విషయాల గురించి చేసే విమర్శలు మీకు నచ్చకపోవచ్చు. మీరు తీవ్రంగా ఖండించడం, మీ సహ ఉద్యోగులకు అంతగా నచ్చకపోవచ్చు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. భాగస్వామ్య వ్యాపారాలు అనుకూలం.



## ధనుస్సు

సినిమా రంగంలో పెట్టుబడి పెట్టాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. వాతావరణంలో వస్తున్న మార్పులకు ఎక్కువగా సతమతమవుతారు. శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుట ఆ బోట్టు ధరించండి. సంతాన విషయంలో మీరు ఎక్కువగా చొరవ తీసుకుంటున్నట్లు విమర్శలు ఎదుర్కొంటారు.



## మకరం

కొన్ని సందర్భాలలో బయట జరుగుతున్న సామాజిక అంశాలను దృష్టిలో ఉంచుకొని మీరు తీసుకునే నిర్ణయాలు కొంతమందికి సరిగ్గా అర్థంకాక మిమ్మల్ని తప్పు పట్టే అవకాశం ఉంది. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్త. శనీశ్వరాలయంలో తైలాభిషేకం జరిపించండి. నలుపు వత్తులు, నువ్వుల నూనెతో దీపారాధన చేయండి. స్నేహితులతో కలిసి ఆనందంగా గడుపుతారు. పాత మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.



## కుంభం


సంఘసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. దైవదర్శనం చేసుకోవాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తారు. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. మెకానికల్, టైలరింగ్ వారికి అనుకూలం. అన్ని ధరలతో పాటు మీ సర్వీసు ధరలను కూడా పెంచగలుగుతారు. తద్వారా మీకు ఎలాంటి నష్టం ఉండదు.





## మీనం

వ్యాపార ప్రదేశాల్లో కుళ్లు రాజకీయాలు పురుడు పోసుకుంటాయి. ప్రత్యర్థులు, అధికారులతో మంతనాలు జరిపి లేనిపోని చలాన్లు విధించడం, సమస్యలు సృష్టించడం మీకు నష్టం కలిగిస్తుంది. ప్రస్తుతమున్న భూమిని అమ్మివేసి వచ్చిన ధనంతో రుణాలు తీర్చి, మిగిలిన ధనంతో దూర ప్రాంతాల్లో వ్యవసాయ భూమిని కొనుగోలు చేయాలన్న ఆలోచనలు ఫలిస్తాయి.

# ఈ వారం కా'ర్టూన్స్'


....'ఫ్రాడ్' గాళ్లతో ఆన్లైన్లోనూ మోసపోయా...
... నీకు ఒరిజినల్ అని గ్యారంటీ ఏంటి?!


అన్నీ ప్రభుత్వ పథకాలే కనిపిస్తున్నాయా?!


- తెలుగు -
సర్వాంతర్యామి?
మొబైల్ ఫోన్ సర్!

ప్రపంచంలో అతి సన్నని నగరంగా పేరు పొందిన యాంజిన్ చైనాలో ఉంది. నది ఒడ్డునే అపార్ట్‌మెంట్లు, భవనాలు నిర్మించటం విశేషం. చుట్టూ ఎత్తయిన పర్వతాలు, నది, నది ఒడ్డున నిర్మించే భవనాల సముదాయం చూడడానికి రెండు కళ్లు చాలవేమో అనిపిస్తుంది.

